
ఐదో రోడ్డులో పూజలందుకుంటున్న కనకదుర్గమ్మ



శ్రావణ లక్ష్మీ.. పాహిమాం

• పవిత్ర మాసం ఆగమనం • ఆలయాల్లో తొలి శుక్రవారం పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు


చెరువుకట్టపై ప్రత్యేక అలంకరణలో నిమిషాంబ దేవి

పవిత్ర శ్రావణ మాసం శుక్రవారం మొదలైంది. తొలి రోజే 'శ్రావణ శుక్రవారం' కావడంతో జిల్లా వ్యాప్తంగా ఆలయాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారికి వివిధ రకాల పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. ప్రత్యేక అలంకరణలు, పూజలతో ఎటు చూసినా సందడి కనిపించింది. మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని శ్రావణ లక్ష్మిని పూజించి, ఆహ్వానించారు. అనంతపురం పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ఆవరణలో ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో మహా త్రిపుర సుందరి దేవిని కొలువుదీర్చి, దాదాపు 500 రకాల పిండివంటలతో నైవేద్యం సమర్పించారు. సామూహిక లలితాసహస్రనామ పారాయణం చేశారు. చెరువుకట్టపై నిమిషాంబ దేవి ఆలయం, ఐదో రోడ్డు కనకదుర్గ భవాని ఆలయంలో అమ్మ వార్లకు ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. మహిళలు జ్యోతులతో అమ్మవారికి హారతులు పట్టారు. **- ఆంధ్రజ్యోతి, అనంతపురం టౌన్**


అమ్మవారికి సమర్పించిన పిండి వంటకాలు, పూజల్లో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు

సామాజిక బాధ్యతకు తూట్లు..!

- సీఎస్‌ఆర్ నిధులతో నాసిరకంగా పనులు
- ప్రారంభించకనే దెబ్బతింటున్న ఆర్వో ప్లాంట్లు
- వెలగని వీధిదీపాలు
- సీసీ రోడ్లు వేశారు.. కాలువలు మరిచారు..
- పట్టించుకునే వారు కరువు


ఎగువతూపల్లిలో నిర్మించిన ఆర్వోప్లాంటు

నంబులపూలకుంట, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఊరు బాగుండాలని జీవనాధారమైన భూములను రైతులు త్యాగం చేశారు. యువతకు ఉద్యోగాలు దొరికితే బతుకులు బాగుపడతాయనుకున్నారు. వారి త్యాగాలతో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటైంది. ఆ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కింద భూములిచ్చిన గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులిచ్చింది. వాటితో అభివృద్ధి చేయాల్సిందిపోయి, అడ్డగోలుగా దోచేశారు. కోట్ల రూపాయలతో చేపట్టిన రోడ్లు నాసిరకంగా ఉన్నాయి. మురుగు కాలువలు కూడా నిర్మించకుండానే రోడ్లు వేశారు. కాలువలు లేక మురుగు నీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. పెద్దమొత్తంలో నిధులు వెచ్చించి, సోలార్ వీధిదీపాలు ఏర్పాటు చేశారు. అవికూడా పనిచేయట్లేదు. వాటి స్థానంలో కొత్తవాటినీ ఏర్పాటు చేయలేదు. వాటి కోసం ఎంత వెచ్చించారన్న వివరాలనూ అధికారులు వెల్లడించట్లేదు. తమకు సంబంధం లేదన్నట్లు తప్పించుకుంటున్నారు. ఆయా గ్రామాల ప్రజలకు శుద్ధ జలం సరఫరా చేసే ఉద్దేశంతో స్థానిక అభివృద్ధి నిధుల(ఎల్ఏడీఎఫ్)తో వాటర్ ప్లాంట్లు నిర్మించారు. ప్రారంభం కాకనే అవి దెబ్బతింటున్నాయి. నిర్మాణాలు నాసిరకంగా చేపట్టడమే ఇందుకు కారణమని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. సోలార్ కంపెనీ ఇచ్చే నిధులను దిగమింగి, రైతుల త్యాగాలను అపహాస్యం చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిధులు మింగేసి..

మండలంలోని ఎస్సీకుంట, పి.కొత్తపల్లి, రెవెన్యూ గ్రామాల పరిధిలో 2014లో సోలార్ పార్కు నిర్మాణం ప్రారంభించారు. భూములిచ్చిన రైతుకు పాత పట్టా ఎకరాకు రూ.3 లక్షలు, డిపట్టాలకు రూ.2 లక్షలు మేర అందించారు. నేటికీ పరిహారానికి నోచుకోని రైతులు ఉన్నట్లు రెవెన్యూ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అప్పట్లో 7,300 ఎకరాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. వెయ్యి మెగా ఓల్ట్‌ల సౌర విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. పరిశ్రమలు ప్రతి ఐదేళ్లకోసారి సీఎస్‌ఆర్ కింద గ్రామాలకు నిధులిస్తాయి. వీటిని గ్రామాల్లో తాగునీరు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయల కల్పనకు వెచ్చించాల్సి ఉంటుంది. ఇప్పటికే మండలంలో సీఎస్‌ఆర్ నిధులతో రోడ్లు, సోలార్ వీధిదీపాలు, ఆలయాలు, ఆర్వో ప్లాంట్లు, భవనాలు నిర్మించారు. నాసిరకంగా నిర్మాణాలు చేపట్టి, నిధులు మింగేశారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

మురుగు కాలువలు లేకుండానే రోడ్లు..

నంబులపూలకుంట, పి.కొత్తపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో రోడ్ల నిర్మాణానికి సీఎస్‌ఆర్ నిధులు రూ.మూడు కోట్ల చొప్పున ఇచ్చారు. మురుగు కాలువలు లేకుండానే రోడ్లు వేసి, మమ అనిపించారు. ఎగువ ప్రాంతాల్లో నివాసాల వారు మురుగునీరు రోడ్డుపైకి వదులుతుండడంతో దిగువన ఉన్న వారు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీటితో దోమలు అధికమై, వ్యాధులు (మిగతా 6వ పేజీలో...)


నారసింహుడికే నామాలు..!

భూముల లీజులో మాయాజాలం

వేలం ఒకరిది.. సాగు మరొకరిది
కొన్ని చోట్ల దేవుడి భూమి విక్రయం
కొరవడిన దేవదాయశాఖ పర్యవేక్షణ
పెన్నహోబిలేశుడికి కౌలుదారుల శఠగోపం


కోనాపురం సమీపంలో ఉన్న ఆలయ భూమి

ఉరవకొండ, జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూములు కొన్నేళ్లుగా కొందరి చేతిలో చిక్కుకున్నాయి. సొంత భూములు ఉన్నా సరే కొందరు నామమాత్రపు కౌలు చెల్లిస్తూ ఆలయ భూమిని ఏళ్లుగా అనుభవిస్తున్నారు. ఆలయ భూములను బహిరంగ వేలం వేస్తామని ఏడాది కాలంగా అధికారులు చెబుతున్న మాటలు వాస్తవ రూపం దాల్చలేదు. సాగులో ఉన్న వారినే కొనసాగిస్తూ, నామమాత్రంగా కౌలును పెంచారు. దీంతో ఆలయం ఆదాయం కోల్పోవాల్సి వచ్చింది. ఆలయానికి 2114ఎకరాల మాణ్యం ఉంది. ఇందులో 146ఎకరాల ఈనామ్ భూమి, 412ఎకరాల్లో అటవీ ప్రాంతం ఉంది. మిగిలిన 1556ఎకరాలు ఆమిద్యాల, మోపిడి, కోనాపురం, పెద్దముష్టూరు, మూలగిరిపల్లి, రాచర్ల, చిన్నముష్టూరు గ్రామాల పరిధిలో ఉన్నాయి. ఎకరాకు రూ.500 నుంచి రూ.2,500లు మాత్రమే కౌలు చెల్లిస్తున్నారు. అవి కూడా సక్రమంగా చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోతు న్నాయి. సాధారణంగా వర్షాధారం అయితే ఎకరాకు రూ.6వేలు, సాగు నీరు ఉంటే ఎకరాకు రూ.20వేలు కౌలు చెల్లించే పరిస్థితి ఉంది. అయితే నరసింహ స్వామి భూములకు మాత్రం అంతంతమాత్రంగానే కౌలు చెల్లిస్తున్నారు. భూములన్నీ సారవంతమైనవి కావడంతో వేరుశనగతో పాటు ఉద్యాన పంటలు సాగు చేస్తూ మంచి దిగుబడులు పొందుతున్నారు.


లక్ష్మీనరసింహస్వామి ఆలయం

రికార్డులో ఒకరు సాగులో మరొకరు

భూములు కౌలుకు తీసుకున్న వారు అనధికారికంగా వాటిని మరొకరికి బదలాయిస్తున్నారు. అంతేకాక కొందరు వాటిని విక్రయించి రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. మోపిడి, ఆమిద్యాల కోనాపురం గ్రామాల్లో 800నుంచి 1000ఎకరాల దాకా దేవాలయ భూములు ఉన్నాయి. ఇటీవల మోపిడికి సంబంధించిన భూములు కోనాపురం దగ్గర్లో అనధికారికంగా మూడు ఎకరాలను విక్రయించినట్లు సమాచారం. అలాగే ఆమిద్యాలలో దేవాలయానికి సంబంధించిన భూములను రెండేళ్ల కిందట అమ్మినట్లు చర్చ నడుస్తోంది. గ్రామాలను బట్టి ఎకరాకు రూ.3లక్షలు పైగా పలుకుతోంది. కొనుగోలు దారులు లీజు దారులనుంచి అగ్రిమెంట్ రాయించుకుని, సాగు చేసుకుంటున్నారు. భూములపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో ఎవరు సాగులో ఉన్నారో కూడా అధికారులకు తెలియని పరిస్థితి ఉంది.

వైసీపీ రాకతో...

2019 తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో అప్పటి అధికారులు నాయకులు చెప్పిందే తడవుగా సాగులో ఉన్న వారిని కాదని, వైసీపీ నాయకులకు కౌలుకు భూములు ఇచ్చినట్లు ఏకంగా రసీదులు కూడా రాశారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే అధికారులు ఆ నాయకులకు భూములు కట్టబెడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2024కి సుమారుగా 1400ఎకరాలకు కౌలు లీజు ముగిసినా, నేటికీ ఆలయ భూముల బహిరంగ వేలంపై అధికారులు దృష్టి సారించడం లేదు. వేల ఎకరాల భూమికి కౌలు కింద రూ.15లక్షలు మాత్రమే ఆదాయం వస్తోంది. ఎకరాకు కనీసం రూ.ఐదువేలు చెల్లించినా రూ.కోటికి పైగా దాకా ఆదాయం వస్తుంది. దీని ద్వారా ఆలయ అభివృద్ధితో పాటు, భక్తులకు సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడానికి వీలుంటుంది.

వేలం పాట నిర్వహిస్తాం

దేవాలయ భూముల బహిరంగవేలం నిర్వహించడానికి చర్యలు తీసుకుంటాం. 1400ఎకరాలకు ఏడాదిగా వేలం నిర్వహించలేదు. ఆలయభూములకు వేలాన్ని నిర్వహించి, ఆదాయాన్ని పెంచడానికి చర్యలు చేపడతాం. **- రమేష్, ఆలయ ఈవో**

ఉమ్మడి జిల్లాకు మరిన్ని పరిశ్రమలు

- సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే బాలకృష్ణ శ్రద్ధ
- పురంలో నందమూరి వసుంధరాదేవి
- 'సుపరిపాలనలో తొలి అడుగు'కు విశేష స్పందన


వసుంధరాదేవికి గజమాల వేసి హారతులు పడుతున్న మహిళలు

హిందూపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధి చెందాలంటే మరిన్ని పరిశ్రమలు రావాల్సి ఉందని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరా దేవి అన్నారు. పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు పుష్కలంగా దొరుకుతాయని అన్నారు. సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే బాలకృష్ణ ఈ అంశంపై ప్రత్యేక (మిగతా 6లో...)

గుప్తనిధుల వేట

జిల్లాలో రెండుచోట్ల తవ్వకాలు
నాగసముద్రం వద్ద తొమ్మిది మంది అరెస్టు
కుందుర్పి మండలంలో అదుపులో ఓ ముఠా?


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు, రూరల్ పోలీసులు
(6లో)

ఓట్లేసి ఎన్నుకుంటే.. అభివృద్ధిని అడ్డుకుంటారా?

• ఆత్మకూరు ఎంపీపీని నిలదీసిన ప్రజలు • సర్వసభ్య సమావేశంలో ఆందోళన


ఎంపీపీని నిలదీస్తున్న మండల ప్రజలు

ఆత్మకూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎంపీపీ హేమలత మండలంలో అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని ప్రజలు మండిపడ్డారు. 'ఓట్లేసి ఎన్నుకుంటే.. అభివృద్ధి చేయాల్సింది పోయి.. అడ్డుకుంటారా..' అంటూ నిలదీశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో ప్రజలు ఆందోళనకు దిగారు. ఎంపీపీ హేమలత రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పట్నుంచి గ్రామాల్లో అభివృద్ధి పనులను ఎంపీపీ అడ్డుకోవడమే కాకుండా అధికారులను లెక్కచేయకుండా వ్యవహరిస్తున్నారంటూ ధ్వజమెత్తారు. సమస్యను పరిష్కరిస్తామని ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు హామీ ఇవ్వడంతో వారు శాంతించి, వెళ్లిపోయారు. అనంతరం సర్వసభ్య సమావేశం కొనసాగింది. అధికారులు తమ శాఖల పరిధిలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించ సాగారు. అభివృద్ధి పనులకు తీర్మానాలు చేయలేదని తెలుసుకున్న అర్జీదారులు మరోసారి ఎంపీపీతో వాగ్వాదానికి దిగారు. ఎంపీపీ సరైన సమాధానం చెప్పకపోవడంతో కాసేపు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇంతలోనే ఎంపీపీ సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఎంపీటీసీలు విజయ్‌కుమార్, పోతులయ్య జోక్యం చేసుకుని అభివృద్ధి పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్ నాయుడు, మండల అధికారులు పాల్గొన్నారు.

మంచి ర్యాంక్ ఉన్నా అన్యాయం చేశారు
హైకోర్టులో పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు

28కి అగ్రికల్చర్ అసిస్టెంట్ల కేసు విచారణ వాయిదా
(6లో)

ఫిర్యాదు ఉంటేనే..!
• బదిలీ అక్రమాలపై విచారణకు షరతు
• విస్తుగొలిపేలా విద్యాశాఖ నిర్ణయాలు
(6లో)

వామ్మో.. చిరుత..!
• సోషల్ మీడియాలో వీడియో వైరల్
• ప్రజలకు పోలీసుల జాగ్రత్తలు
• రాయదుర్గం వద్ద కొండపై మరొకటి ప్రత్యక్షం (7లో..)



పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి దేవాలయం

ఇదీ చరిత్ర..

14వ శతాబ్దంలో సంహపురి (నేటి నెల్లూరు)ని కాటమరాజు పరిపాలించే రోజుల్లో విపరీతమైన కరువు సంభవించింది. రాజు ఆజ్ఞ ప్రకారం పశువుల విడిది కోసం సేనాధిపతి రాజ్యమంతా తిరుగుతూ ఖాద్రీ పురం (కదిరి) గ్రామానికి చేరాడు. పట్టణంలోని శ్రీ ఖాద్రీ నరసింహస్వామిని దర్శించుకున్న సేనాధిపతి గుర్రాలను మేతకు విడిచి గ్రామమంతా తిరిగాడు. గ్రామం మొత్తం మల్లెపూల పరిమళం, ఎటుచూసినా పచ్చని పొలాలతో సస్యశ్యామలంగా ఉండడాన్ని చూసి, ఈ ప్రాంతాన్ని కరువు విడిదిగా ఎంచుకున్నాడు సేనాధిపతి. విషయం రాజుకు తెలియజేశాడు. రాజు ఆజ్ఞ ప్రకారం కదిరి పట్టణానికి ఏడు మైళ్ల దూరంలో ఉన్న నల్లచెరువు గ్రామ పరిధిలోని దిన్నె మీద పశువుల కోసం పాగా వేశారు. దిన్నెమీద ఉన్న గడ్డి మేయగానే పశువులు సమృద్ధిగా పాలిచ్చాయి. ఇలా కొన్నిరోజులు గడిచాక పశువులు పాకవేసిన ప్రాంతానికి కొంత దూరంలో పుట్ట ఉండేది. ఆ పుట్ట దగ్గరకు ఈనని గోవులు వెళ్లి నిలబడగా వాటి పొదుగు నుంచి పాలుగారి పుట్టలోకి వెళ్తున్న విషయాన్ని గమనించి సేనాధిపతి ఆశ్చర్యానికి లోనయ్యాడు. పుట్టకు పూజలు చేసి, తవ్వించి చూడగా శ్రీరాముడి పరమ భక్తుడైన ఆంజనేయుడి విగ్రహం బయటపడింది. సేనాధిపతి ద్వారా విషయం తెలుసుకున్న కాటమరాజు.. స్వామి విగ్రహాన్ని ఆ స్థలంలో ప్రతిష్ఠించారు. ఒక్క రోజులోనే స్వామి గుడి కట్టారు. పాలు పారిన దిన్నె కాబట్టి పాలపాటిదిన్నెగా ప్రసిద్ధి చెందింది.

పాహిమాం.. అంజనా్న..

నేటి నుంచి శ్రావణ మాస ఉత్సవాలు

భక్తుల కొంగుబంగారం పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి

నల్లచెరువు, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రమాణాల దేవుడిగా పేరొందిన శ్రీ పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయం ఉత్సవ శోభను సంతరించుకుంది. శనివారం శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. మండలంలో వెలసిన పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా ప్రసిద్ధి. కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాలతోపాటు కర్ణాటక నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. శ్రావణమాస ఉత్సవాలు ప్రత్యేకం. నెలలోని అన్ని శనివారాల్లో స్వామివారి ఉత్సవాలు నిర్వహిస్తారు. మంగళవారాల్లో కూడా ప్రత్యేక పూజలు చేస్తారు. దీంతో శ్రావణ మాసం అంతా ఆలయంలో సందడిగా ఉంటుంది. స్వామి సన్నిధిలో అబద్ధపు ప్రమాణం చేస్తే కీడు వాటిల్లుతుందని భక్తుల విశ్వాసం. దీంతో పక్క జిల్లాల నుంచి ఇక్కడికి ప్రమాణాలు చేసేందుకు వస్తుంటారు.

బావిలో చేదబావి

ఆలయ ప్రాంగణంలోని బావిలో చేదబావి ఉండడం ఎంతో ప్రత్యేకం. ఈ బావిలో స్నానం ఆచరించి తలనీలాలు సమర్పించి దేవుడిని దర్శించుకుంటే పుణ్యం ప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం. ఎలాంటి కరువుకాటకాలు వచ్చినా ఈ చేద బావిలో నీరు ఇంకిపోదు. శ్రావణ మాసంలో ఐదు శనివారాల్లో ఉత్సవాలు, మంగళవారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.



బావిలో ఉన్న చేదబావి

భక్తులకు వసతులు కల్పించాం

ఆలయంలో శ్రావణమాస ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులను నడపనుంది. దర్శనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. పోలీసు శాఖ ద్వారా పటిష్ట బందోబస్తు కల్పిస్తాం.

- మురళీకృష్ణ, ఆలయ ఈఓ





ఆంజనేయ స్వామి మూలవిరాట్

ఆలయానికి చేరుకోవచ్చు ఇలా..

కదిరి నుంచి నల్లచెరువు పాతరైల్వేస్టేషన్ వద్ద దిగితే అక్కడినుంచి ఆటోలు వెళ్తాయి. నల్లచెరువు నుంచి పాలపాటి దిన్నెకు ఆటోలు నడుస్తుంటాయి. ఆర్టీసీ శ్రావణమాసం సందర్భంగా 20 ప్రత్యేక బస్సులు నడుపుతోంది. కదిరి నుంచి ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు నడుస్తుందని ఆర్టీసీ డీఎం తెలిపారు.

ఉమ్మడి జిల్లాకు మరిన్ని పరిశ్రమలు

(5వ పేజీ తరువాయి)

శ్రద్ధ పెట్టారని అన్నారు. హిందూపురం నియోజకవర్గంలో శుక్రవారం ఆమె విస్తృతంగా పర్యటించారు. తూమకుంట చెక్‌పోస్టు వద్ద ఆమెకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి గోళ్లాపురం పారిశ్రామికవాడకు వెళ్లి నూతనంగా నిర్మించిన 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. హిందూపురం మండలంలోని వీవర్స్ కాలనీలో ఇంటింటికి వెళ్లి 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం లేపాక్షి-ఒబుళాపురం బీటీ రోడ్డును ప్రారంభించారు. చిలమత్తూరు మండలం తమ్మనాయనపల్లి రోడ్డుకు భూమిపూజ చేశారు. హెరిటేజ్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో సమకూర్చిన సోలార్ వాటర్ హీటర్‌లను లేపాక్షి నవోదయ పాఠశాలలో ప్రారంభించారు.



లేపాక్షి నవోదయ పాఠశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న వసుంధరాదేవి

విద్యార్థినులను పలకరించి, యోగక్షేమాలను తెలుసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు. హిందూపురం వీవర్స్‌కాలనీ, 8, 9 వార్డులలో జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, హిందూపురం నియోజకవర్గానికి మరిన్ని పరిశ్రమలు వస్తాయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురం అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని అన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, తొలి అడుగు కార్యక్రమంలో మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు ముందుకొచ్చి ఈ విషయం చెబుతున్నారని అన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు కాలువలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడానికి హిందూపురానికి రూ.92 కోట్లు నిధులు వచ్చాయని తెలిపారు. పట్టణంలో పాత పైప్‌లైన్ స్థానంలో కొత్త పైప్‌లైన్ ఏర్పాటుకు రూ.136 కోట్లు మంజూరయ్యాయని, ఈ పనులు త్వరలో ప్రారంభమౌతాయని తెలిపారు. ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని అన్నారు. శ్రావణమాసం మొదటి శుక్రవారం హిందూపురంలో జనం మధ్య గడపటం సంతోషంగా ఉందని అన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద రూ.45కోట్ల పనులు జరిగాయని తెలిపారు. వచ్చే రెండు మూడు మాసాల్లో మరో రూ.40 కోట్లు వస్తాయని తెలిపారు. హిందూపురం చేనేత కార్మికులు నేసిన చీరలనే తాను ధరిస్తానని అన్నారు. పలుచోట్ల మహిళలు వసుంధరాదేవికి చీర, సారె, పసుపు కుంకుమ అందజేశారు. మహిళలను ఆమె ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే పీఏలు సురేంద్ర, వీరయ్య, మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వర్థరెడ్డి, పార్టీ కన్వీనర్‌లు ప్రెస్ వెంకటేశ్, హెచ్ఎన్ రాము, అభిలాష్, శ్రీనివాస్, నాయకులు దేవరాజ్, మంగేష్, అనీల్, పరిమళ, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలతోనే ఆర్థిక ప్రగతి : ఇన్‌చార్జ్ కలెక్టర్



అనంతపురం కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపన విస్తృతంగా జరగాలని, వాటితో ఆర్థిక ప్రగతి సాధించవచ్చని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం 60వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఏపీసీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగం పటిష్టం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి వారికి సకాలంలో సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అన్ని రకాల అనుమతులను ఇవ్వాలన్నారు. గత నెలలో జరిగిన సమావేశం నుంచి ప్రస్తుతం సింగిల్ డెస్క్ విధానంలో 224 ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోగా 25 దరఖాస్తులను ఆమోదించారని, మిగిలిన దరఖాస్తులను సత్వరమే పరిశీలించి ఆమోదించాలని ఆదేశించారు. జిల్లాలో 2020-23, 2023-27 పాలసీలో 13 యూనిట్లకు గాను రూ.2,30,54,540లు సబ్సిడీ మంజూరుకు సమావేశంలో ఆమోదం తెలిపారు. జిల్లాలో ఎంఎస్ఎంఈ పార్కులో ఏర్పాటు చేయడానికి అనువైన స్థలాలను గుర్తించాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌ను ఆదేశించారు. జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయబోతున్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువతకు టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్, స్కిల్ ట్రైనింగ్ ఇచ్చే విధంగా ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాస్‌యాదవ్, ఏడీ రాజశేఖర్‌రెడ్డి, వాణిజ్య శాఖ కృష్ణారెడ్డి, ఆర్టీఓ వీర్రాజు, ఏపీఐఐసీ మేనేజర్ మల్లికార్జున, డీఎస్‌డీఓ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రతి శాఖ సమన్వయంతో పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారంలో ఎన్‌సీఓఆర్‌డీ(నార్కో కోఆర్డినేషన్ సెంటర్)జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ... మాదక ద్రవ్యాల వినియోగంతో జరిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గంజాయి సాగు లాంటివి ఎక్కడైనా జరిగినట్లు తెలిస్తే టోల్‌ఫ్రీ నెంబర్ 1972కు సమాచారం అందించాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో టోల్‌ఫ్రీ ఏర్పాటు చేసి డ్రగ్స్ సరఫరా, వినియోగం లేకుండా గట్టి నిఘా పెంచి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీలు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, సీఐలు హరినాథ్, హనుమంతు పాల్గొన్నారు.

గుప్త నిధుల వేట



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎక్స్‌కవేటర్, సుమో

జిల్లాలో రెండుచోట్ల తవ్వకాలు

నాగసముద్రం వద్ద తొమ్మిది మంది అరెస్టు

కుందుర్పి మండలంలో అదుపులోకి ముఠా?

గుంతకల్లు/కళ్యాణదుర్గం/కుందుర్పి, జూలై25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు వేర్వేరుచోట్ల గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపడుతున్న ముఠాల ఆట కట్టించారు పోలీసులు. ఓ చోట తొమ్మిది మందిని అరెస్టు చేయగా.. మరోచోట ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గుంతకల్లు మండలం నాగసముద్రం గ్రామం వద్ద గుప్తనిధుల కోసం తవ్వకాలు చేస్తున్న తొమ్మిది మందిని గుంతకల్లు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ముఠా అరెస్టు వివరాలను శుక్రవారం ఉదయం గుంతకల్లు రూరల్ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసులు వెల్లడించారు. నాగసముద్రం గ్రామం వద్ద ఉన్న చౌడమ్మ దేవాలయ సమీపంలో కొందరు గుప్తనిధుల కోసం తవ్వకాలు చేస్తున్నారన్న సమాచారం రావడంతో రూరల్ ఎస్ఐ రాఘవేంద్రప్ప ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం దాడి చేశారు. అనంతపురం జిల్లా, తెలంగాణ రాష్ట్రానికి చెందిన తొమ్మిది మంది తవ్వకపు సామగ్రితో పట్టుబడ్డారు. వజ్రకరూరు మండలం కొనకొండ్లకు చెందిన తిమ్మాపురం రాము, కమలపాడు వాసి బురుజుల బోయ శ్రీనివాసులు, గుంతకల్లు పట్టణం దోనిముక్కల రోడ్డులో నివసిస్తున్న మేకల దేవేంద్ర, పామిడి మండలం గజరాంపల్లికి చెందిన జే పరశురాముడు, తెలంగాణ రాష్ట్రానికి చెందిన పసుపుల మహేందర్, ఇరికల వెంకటేశులు, మాడ మహేందర్, భట్టగిరి అంజులయ్య, ముద్దనూరి సురేంద్రను అరెస్టు చేశారు. మరో ఇద్దరు సూరి, నారాయణస్వామి పరారయ్యారని డీఎస్పీ తెలిపారు. పట్టుబడిన వారి నుంచి ఆటో, ఇన్నోవా వాహనం, గుప్త నిధులను గుర్తించే మెటల్ డిటెక్టర్, తవ్వకం సామగ్రితోపాటు, తవ్వకాల్లో దొరికిన మట్టికుండ, 8 సీసపు గోళీలు, సీసపు కడ్డీలు, రెండు చిన్న ఉంగరాలు, రెండు చిన్న ప్రతిమలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పోలీసుల అదుపులో 9 మంది..

కుందుర్పి మండలంలోని రుద్రంపల్లి సమీపాన మల్లప్ప దేవాలయ పరిసర ప్రాంతంలో ఓ తోటలో గురువారం అర్ధరాత్రి గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపడుతున్న 9 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఎక్స్‌కవేటర్, సుమో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఓ వ్యక్తి గుప్తనిధులు తీసుకువచ్చి ఈ ప్రాంతంలో పాతిపెట్టి, చనిపోయాడని పలువురు ఆ దాచిపెట్టిన గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టారు.

అలా.. పోలీసులకు దొరికిపోయినట్లు తెలుస్తోంది. కుందుర్పి మండలం రుద్రంపల్లికి చెందిన ముగ్గురు, అనంతపురానికి చెందిన ముగ్గురు, కేరళ వాసులు ఇద్దరు, కంబదూరు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. రెండ్రోజుల్లో వివరాలు వెల్లడించే అవకాశాలు ఉన్నాయి.

ఫిర్యాదు ఉంటేనే..!

● బదిలీ అక్రమాలపై విచారణకు షరతు ● విస్తుగొలిపేలా విద్యాశాఖ నిర్ణయాలు

అనంతపురం విద్య, జూలై 25(ఆంధ్రజ్యోతి): బదిలీల సమయంలో అడ్డదారులు తొక్కిన ఉపాధ్యాయులకు విద్యాశాఖ కమిషనరేట్ 'పెద్ద ఊరట' కల్పించింది. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు, 'గడువులోగా వచ్చిన ఫిర్యాదులపై మాత్రమే విచారించండి' అని జిల్లా అధికారులను ఆదేశించింది. జిల్లాలో బదిలీలలో లబ్ధికోసం 422 మంది ఉపాధ్యాయులు మెడికల్ సర్టిఫికెట్లను సమర్పించారు. వీటిలో భారీగా నకిలీవి ఉన్నాయని అప్పట్లో కొందరు ఉపాధ్యాయులు గగ్గోలు పెట్టారు. వీటిలో 12 సర్టిఫికెట్లపై మాత్రమే అప్పట్లో ఫిర్యాదులు అందాయి. దీంతో వాటిని మాత్రమే విద్యాశాఖ అధికారులు పరిగణనలోకి తీసుకుని, విచారించేందుకు సిద్ధమవుతున్నారు.

భారీగా అక్రమాలు

బదిలీల సమయంలో తమకు అనుకూలమైన ప్రాంతాలకు వెళ్లేందుకు పలువురు ఉపాధ్యాయులు అడ్డదారులు తొక్కారు. నకిలీ మెడికల్ సర్టిఫికెట్లు సమర్పించారు. నిబంధనల మేరకు స్పౌజ్ పాయింట్లు పెట్టి ఉంటే భర్త, లేదా భార్య ఎక్కడ పనిచేస్తుంటే అక్కడకు బదిలీ చేయాల్సి ఉంటుంది. కానీ వెబ్ కౌన్సెలింగ్‌లో ఇష్టానుసారంగా స్థానాలకు ఆప్షన్లు ఇచ్చారు. లేని రోగాలు ఉన్నట్లు చూపించి, నకిలీ మెడికల్ సర్టిఫికెట్లు సమర్పించారు. తద్వారా ప్రిఫరెన్షియల్ కేటగిరీలో కోరుకున్న స్థానాలను దక్కించుకున్నారు. ఈ అక్రమాలపై బాధిత ఉపాధ్యాయులు అప్పట్లో గళం విప్పారు. అధికారులు విచారించి, న్యాయం చేయాలని వేడుకున్నారు.

షరతులు వర్తించాయి..

అక్రమాలపై విచారిస్తామని చెబుతూనే.. అక్రమార్కులకు కొందరు అధికారులు అప్పట్లో కొమ్ముకాశారు. బదిలీలలో చేయాల్సిందంతా చేశారు. ఇప్పుడు ప్లేటు ఫిరాయించి, అభ్యంతరాలకు గడువు ఇచ్చామని, ఆ లోగా వచ్చిన ఫిర్యాదులను మాత్రమే విచారిస్తామని అంటున్నారు. జిల్లాలో 12 మంది ఉపాధ్యాయుల మెడికల్ సర్టిఫికెట్లపై మాత్రమే ఫిర్యాదులు వచ్చాయని, వాటిని మాత్రమే విచారిస్తామని డీఈఓ ప్రసాద్‌బాబు అంటున్నారు. స్పౌజ్, అక్రమ పాయింట్లు వంటి ఇతర ఫిర్యాదుల విషయంలోనూ 'గడువులోగా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసి ఉంటేనే' అని డీఈఓ కార్యాలయ అధికారులు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఇది కమిషనరేట్ నిర్ణయం అని చెప్పి తప్పుకుంటున్నారు. దీంతో అక్రమార్కులు 'హమ్మయ్యా..' అని ఊపిరి పీల్చుకుంటున్నారు. నష్టపోయిన ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మంచి ర్యాంక్ ఉన్నా అన్యాయం చేశారు

హైకోర్టులో పిటిషనర్ల తరపు న్యాయవాది

అగ్రికల్చర్ అసిస్టెంట్ల కేసు విచారణ 28కి వాయిదా

అనంతపురం అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో మంచి ర్యాంకు ఉన్న అగ్రికల్చర్ అసిస్టెంట్లకు బదిలీల్లో అన్యాయం చేయడంతో పాటు స్టేటస్ కో ఆర్డర్‌ను అమలు చేయలేదని పిటీషనర్ల తరపు న్యాయవాది హైకోర్టులో వాదనలు వినిపించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో తమకు అన్యాయం జరిగిందని శ్రీసత్యసాయి జిల్లాలోని 11 మంది, అనంత జిల్లాలో ఇద్దరు, కర్నూలులో 20 మంది, ప్రకాశం, చిత్తూరు జిల్లాకు చెందిన మరికొందరు అగ్రికల్చర్ అసిస్టెంట్లు హైకోర్టును వేర్వేరుగా ఆశ్రయించారు. ఆయా జిల్లాల సిబ్బంది రిట్ పిటిషన్లపై హైకోర్టు వేర్వేరుగా స్టేటస్‌కో ఆర్డర్లు జారీ చేసింది. అయితే ఆయా జిల్లాల సిబ్బంది అందరిది ఒకే సమస్య కావడంతో అన్ని పిటిషన్లను కలిపి ఈనెల 23న విచారణకు పిలిచింది. అయితే అగ్రికల్చర్ అసిస్టెంట్ల పిటిషన్‌పై వ్యవసాయ శాఖ కౌంటర్ (అఫిడవిట్) దాఖలు చేయకపోవడంతో శుక్రవారానికి విచారణ వాయిదా వేసిన విషయం తెలిసిందే. శుక్రవారం రెండో సారి విచారణలో ఉమ్మడి అనంతకు జిల్లా పిటీషనర్ల తరపు న్యాయవాది అగ్రికల్చర్ అసిస్టెంట్ల బదిలీల్లో జరిగిన అన్యాయాన్ని జడ్జి దృష్టికి తీసుకువెళ్లారు. మరింత సమాచారం సేకరణ కోసం విచారణను ఈనెల 28కి జడ్జి వాయిదా వేశారు.

స్టేటస్‌కోను పట్టించుకోని అధికారులు

ఉమ్మడి జిల్లాకు సంబంధించి రైతు సేవా కేంద్రంలో పనిచేసే విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు గత నెల 28న అనంత జేడీఏ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. పలువురు సిబ్బందికి మంచి ర్యాంక్ ఉన్నా వారు అడిగిన స్థానాలు కేటాయించలేదు. దీంతో తమకు మంచి ర్యాంక్ ఉన్నా, అడిగిన మూడు ఆప్షన్లల్లో ఏ ఒక్క స్థానం ఇవ్వకుండా అన్యాయం చేశారంటూ శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన 11 మంది అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఈనెల 14న హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. ప్రస్తుతం సిబ్బంది పనిచేస్తున్న స్థానాల్లోనే రెండు వారాల పాటు కొనసాగించాలంటూ ఈనెల 15న హైకోర్టు స్టేటస్‌కో ఆర్డర్ ఇచ్చింది. దీన్ని ఉద్యోగుల తరపు న్యాయవాది ఈనెల 17న అనంత జేడీఏ కార్యాలయంలో అందజేసినట్లు సమాచారం. అయితే తమకు కోర్టు ద్వారా నేరుగా ఉత్తర్వులు రాలేదన్న కారణంతో సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోలేదని సమాచారం. శుక్రవారం జరిగిన విచారణకు జేడీఏ కార్యాలయం నుంచి ఓ అధికారిని పంపారు. అయితే స్టేటస్ కో ఆర్డర్ మేరకు సంబంధిత అధికారులకు ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని సమాచారం. బదిలీల్లో అన్యాయం చేయడంతోపాటు స్టేటస్ కో ఆర్డర్‌ను అమలు చేయలేదన్న విషయాన్ని న్యాయవాది జడ్జి దృష్టికి మరో సారి తాజా పరిస్థితిని తీసుకువెళ్లినట్లు తెలిసింది.

ప్రతి సమస్యకూ పరిష్కారం చూపిస్తాం

'మీ సమస్య.. మా బాధ్యత'లో పరిటాల శ్రీరామ్

ధర్మవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకూ తప్పక పరిష్కారం చూపిస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. పట్టణంలోని శివానగర్, కేశవనగర్‌లో శుక్రవారం 'మీ సమస్య.. మా బాధ్యత' పేరిట వినూత్న కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారు. శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించుకుని, అక్కడే ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కేశవనగర్‌లో గ్రీవెన్స్ నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, మున్సిపల్, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.ప్రజల సమస్యలలో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ, సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో తమ దృష్టికి అనేక సమస్యలు వచ్చాయని అన్నారు. వాటిని పరిష్కరించే బాధ్యతను తీసుకుంటామని అన్నారు. సచివాలయ స్థాయిలో ఉన్నవి ఇక్కడే పరిష్కరిస్తామని, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తామని అన్నారు. వైసీపీ హయాంలో నిర్ణయాలవల్ల పింఛన్లు, ఇంటి స్థలాల పట్టాల విషయంలో అక్రమాలు జరిగాయని, అర్హులకు అన్యాయం జరిగిందని అన్నారు. పరిశీలించి, న్యాయం చేస్తామని అన్నారు. అమరావతి గురించి మాట్లాడే నైతిక హక్కు మాజీ సీఎం జగన్‌కు లేదని విమర్శించారు. వారి ఎమ్మెల్యేలతో కలిసి అక్కడ పర్యటిస్తే జరిగిన అభివృద్ధి ఏమిటో తెలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఏపీసీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి చింతలపల్లి మహేశ్ చౌదరి, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, 7వ వార్డు ఇన్‌చార్జి పల్లపు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తూ, సమస్యలను తెలుసుకుంటున్న పరిటాల శ్రీరామ్

హమ్మయ్యా..! పిల్లలు దొరికేశారు

స్కూల్ నుంచి వెళ్లిపోయిన విద్యార్థులు సేఫ్

తిరుమల నుంచి తీసుకొస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం/విద్య, జూలై 25(ఆంధ్రజ్యోతి): స్కూల్ నుంచి వెళ్లిపోయిన విద్యార్థులను అనంతపురం పోలీసులు గుర్తించారు. రాత్రింబవళ్లు శ్రమించి శుక్రవారం తిరుమలలో ఉన్నట్లు గుర్తించి అనంతపురం తీసుకొస్తున్నారు. కూడేరు, నార్పల, గార్లదిన్నె, గోరంట్ల మండలాలకు చెందిన విద్యార్థులు నగరంలోని మూడో రోడ్డులో ఉన్న బీసీ హాస్టల్‌లో ఉంటూ పొట్టి శ్రీరాములు స్కూల్‌లో చదువుకుంటున్నారు. ఎప్పటిలాగే గురువారం పాఠశాలకు వెళ్లారు. అయితే అక్కడి నుంచి టీచర్ల కళ్లు కప్పి బయటకు వెళ్లి పోయారు. బడి వదిలిన తర్వాత విద్యార్థులు హాస్టల్‌కు వెళ్లలేదు. రాత్రి పొద్దుపోయినా రాకపోవడంతో కపోవడంతో విద్యార్థుల ఇళ్లకు ఫోన్ చేసి ఆరా తీశారు. అక్కడికి రాలేదని తెలియడంతో త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వార్డెన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ విద్యార్థుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. బెంగళూరు, తిరుపతి నగరాలకు వెళ్లిన రెండు బృందాల పోలీసులు ముమ్మరంగా గాలించారు. ఎట్టకేలకు టెక్నాలజీ సాయంతో విద్యార్థులు తిరుమలలో ఉన్నట్లు గుర్తించారు. అక్కడి పోలీసుల సహకారంతో ఆ విద్యార్థులను గుర్తించి మూడో పట్టణ పోలీసులు శుక్రవారం దగ్గరకు తీసుకున్నారు. తిరుమల నుంచి అనంతపురం బయల్దేరారు. విద్యార్థుల ఆచూకీ కనిపెట్టడంపై సీఐ శాంతిలాల్ మాట్లాడుతూ ముగ్గురు పోలీసులను తిరుమలకు పంపి వెతికించామని పేర్కొన్నారు. సీసీ కెమెరాల్లో పరిశీలించి ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి గుర్తించినట్టు తెలిపారు. విద్యార్థులను గుర్తించడంతో అటు తల్లిదండ్రులు, ఇటు పోలీసులు, హాస్టల్, స్కూల్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

సామాజిక బాధ్యతకు తూట్లు..!

(5వ పేజీ తరువాయి)

ప్రబలే ప్రమాదం ఉంది. ఆ రోడ్లపై నడవాలంటే బురద తొక్కాల్సిందే. వాహనాలు వెళ్తే మురుగు నీరు ఇళ్లలోకి, పాదచారులపై పడుతుండడంతో ఆందోళన చెందుతున్నారు.

ప్రారంభానికి ముందే..

ఎల్ఏడీఏఫ్ నిధులతో చేపట్టిన ఆర్వో ప్లాంట్ల నిర్మాణాల గురించి చెప్పక్కర్లేదు. అన్ని ప్రాంతాల్లో ఆర్వో ప్లాంట్లు బిగించారే తప్ప.. విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. త్వరలో ప్రారంభించాల్సి ఉంది. నేలపై బెడ్డింగ్ సరిగా లేకపోవడంతో పగిలిపోయింది. ఎంత వ్యయంతో ప్లాంట్ల నిర్మాణం చేపట్టారన్న వివరాలు నోటీసు బోర్డులో కూడా పొందుపరచకపోవడం గమనార్హం. పి.కొత్తపల్లి పంచాయతీ పరిధి ఎగువతూపల్లి ఎస్సీ కాలనీలో ఆర్వో ప్లాంట్లు చెరువు ప్రాంతంలో ఏర్పాటు చేశారు. చెరువులోకి నీరు వస్తే ఆర్వో ప్లాంట్లు మునిగిపోతాయి. నాసిరకంగా, అనువుగాని చోట నిర్మాణాలు చేపట్టి, నిధులు బొక్కేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



ఎగువతూపల్లి ఆర్వో ప్లాంటు వద్ద కుంగిన నేల

వెలగని సోలార్ వీధిదీపాలు

నంబులపూలకుంట, పి.కొత్తపల్లి, పెడబల్లి పంచాయతీల్లో దాదాపు వందకిపైగా సోలార్ వీధిదీపాలు వెలగడంలేదు. ఒక్కో విద్యుత్ దీపానికి రూ.వేలు వెచ్చించి ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు ఏర్పాటు చేశారు. ఏడాది కూడా తిరక్కుండానే అవి వెలగట్లేదు. దీంతో స్తంభాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. పంచాయతీ అధికారులను అడిగితే తమకు తెలియదు అంటున్నారు. వెలగని వీధిదీపాల స్థానంలో ప్రత్యామ్నాయంగా ఏర్పాటు కూడా చేయట్లేదు.

నాణ్యంగా నిర్మాణాలు చేపట్టాలి



సీఎస్ఆర్ నిధులతో చేపట్టే నిర్మాణాలు నాణ్యగా ఉండాలి. పూర్వం నుంచి సాగుచేసుకుంటున్న భూములను సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు రైతులు ఇచ్చారు. ఊర్లలోని అందరూ బాగుంటారని త్యాగం చేశారు. వారి త్యాగాల ఫలితంగా లభించే సీఎస్ఆర్ నిధులతో చేపట్టే ఆర్వో ప్లాంట్ల నిర్మాణంలో నాణ్యతకు తిరోదకాలిస్తున్నారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచి తాగునీరు సామాన్యులకు అందుబాటులో ఉండేలా చూడాలి. అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి, పనులు నాణ్యతగా చేపట్టాలి.

- గంగిరెడ్డి, రైతు సంఘం మండల కార్యదర్శి

పాఠశాల భవనం నిర్మించాలి



మా గ్రామంలో ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. సోలార్ పార్కు సీఎస్ఆర్ నిధులతో నూతన భవనాన్ని నిర్మించాలి. ప్రసిద్ధిగాంచిన వీరభద్రస్వామి ఆలయ నిర్మాణం చేపట్టాలి.

- నరసింహులు, వంకమద్ది

క్రైం కార్నర్

రైలు కిందపడి మహిళ మృతి

అనంతపురం న్యూటౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): కల్లూరు, గార్లదిన్నె స్టేషన్ల మధ్య శుక్రవారం రైలు కిందపడి గుర్తుతెలియని మహిళ మృతిచెందింది. రైల్వే ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉదయం 8.30 గంటల సమయంలో ఘటన జరిగిందన్నారు. 30 నుంచి 35 ఏళ్లలోపు వయసున్న మహిళ పంజాబీ డ్రస్‌తో ఉందన్నారు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందిందన్నారు. మృతురాలికి సంబంధించి ఎలాంటి ఆధారాలూ లభించకపోవడంతో గుర్తుతెలియని మహిళగా కేసు నమోదు చేసుకున్నామన్నారు. మృతదేహాన్ని అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించామన్నారు. మృతురాలికి సంబంధించి వారు, ఆచూకీ తెలిసిన వారు 9441445354 నంబరులో సంప్రదించవచ్చని ఎస్‌ఐ తెలిపారు.

నకిలీ పత్రాలతో బురిడీ

- ప్లాట్ అమ్మి రూ.21 లక్షలు కాజేసిన ఘనుడు
- బుక్కరాయసముద్రంలో కేసు నమోదు



ప్లాటును పరిశీలిస్తున్న సీఐ పుల్లయ్య, బాధితురాలు

బుక్కరాయసముద్రం, జూలై 25(ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలతో ఓ మహిళకు ప్లాట్‌ను విక్రయించి, రూ.21లక్షలకు బురిడీ కొట్టించిన సంఘటన మండలంలోని గోవిందంపల్లిలో వెలుగుచూసింది. పోలీసులు, బాధితురాలు తెలిపిన మేరకు... తాడిపత్రి మండలం చిన్న పొలమాడ గ్రామానికి చెందిన చక్కారాము గోవిందంపల్లి గ్రామంలో సర్వేనెంబరు 295-5లో వేసిన లేఅవుట్‌లో ప్లాటు నంబరు 114, 115లో 7.16 సెంట్ల భూమి తన పేరుపై ఉన్నట్లు నకిలీ పత్రాలు సృష్టించుకుని, రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. తర్వాత అనంతపురం వినాయక్ నగర్‌కు చెందిన చాకలి నాగరత్నమ్మకు సెంటు రూ.3లక్షల ప్రకారం ఏడు సెంట్లకు రూ.21లక్షలు తీసుకుని 2021 మార్చి 12న విక్రయించాడు. ఇటీవల ఆ స్థలాన్ని శుభ్రం చేయించుకోవడానికి చాకలి నాగరత్నమ్మ అక్కడికి వెళ్లారు. అప్పటికే ప్లాటు ఒరిజనల్ యాజమాని కాంతమ్మ ఫెన్సింగ్ వేసుకుని ఉన్నారు. దీంతో తమ ప్లాట్‌ను ఎవరో ఆక్రమించారని భావించిన చాకలి నాగరత్నమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కాంతమ్మను, ప్లాట్‌ను అమ్మిన చక్కారామును పిలిపించి డాక్యుమెంట్లను సీఐ పుల్లయ్య పరిశీలించారు. చక్కారాము చూపిన డాక్యుమెంట్ నకిలీది అని తేల్చారు. బాధితురాలు చాకలి నాగరత్నమ్మ ఫిర్యాదు మేరకు చక్కా రాముపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంట్లో ఉన్న బంగారం కుదువపెట్టి, బయట అప్పు చేసి ప్లాట్ కొని, ఇలా మోసపోయానని చాకలి నాగరత్నమ్మ కన్నీరు మున్నీరుగా విలపించారు. పోలీసులు న్యాయం చేయకపోతే తమ కుటుంబం వీధిన పడుతుందని విలపించారు.

భర్త, అత్తపై వేధింపుల కేసు

ధర్మవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): తనను తరచూ వేధిస్తున్నారని భర్త, అత్తపై దండగల భవానీ ఫిర్యాదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఆయన తెలిపిన మేరకు...పట్టణంలోని గిర్రాజుకాలనీకి చెందిన దండగ భవానీ టైలరింగ్ వృత్తితో జీవిస్తోంది. ఈమె భర్త హరీశ్. ఈయన తన తల్లి లక్ష్మీదేవి మాటలు వింటూ తరచూ భవానీ వేధించేవాడు. మద్యానికి బానిసై, వివాహేతర సంబంధాలతో కాలం గడిపేవాడు. తరచూ అవమానిస్తూ, విడాకులు ఇవ్వాలని వేధించేవాడు. దీనికి అతడి తల్లి వత్తాసు పలికేది. ఈ విషయాన్ని భవానీ తన తల్లిదండ్రులకు తెలిపింది. వారు పలు మార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు పెట్టినా భర్త, అత్తలో ఏమాత్రం మార్పు రాలేదు. వేధింపులు తట్టుకోలేక భవానీ మూడు నెలల కిందట పుట్టినిల్లు అయిన పుట్టపర్తి మండలం కర్ణాటక నాగేపల్లికి వెళ్లింది. అయినా హరీశ్ ఫోన్‌లో ఆమెను వేధించేవాడు. దీంతో భవాని, ఆమె తల్లి లక్ష్మి శుక్రవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు హరీశ్, లక్ష్మీదేవిలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యార్థినికి వేధింపులు.. పోక్సో కేసు నమోదు

గుత్తి, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యార్థినిని వేధించడమే కాక, బెదిరించి ఫొటోలు దిగిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలానికి చెందిన విద్యార్థినిపై తురకపల్లికి చెందిన మధుసూదన్ ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడ్డాడు. ఆమె తల్లితండ్రులను చంపుతానని బెదిరించి, విద్యార్థినితో ఫొటోలు దిగాడు. అతడి వేధింపులతో విద్యార్థిని తల్లితండ్రులు ఊరు వదిలి గుత్తి ఆర్ఎస్‌కు చేరుకుని, ఇక్కడే నివశిస్తున్నారు. అయినా మధుసూదన్ వదల్లేదు. తనను వివాహం చేసుకోవాలని హెచ్చరించాడు. 'లేదంటే నిన్నూ, నీ కుటుంబాన్నీ అంతం చేస్తా' అని బెదిరించాడు. దీంతో విషయాన్ని విద్యార్థిని.. తల్లిదండ్రులకు చెప్పింది. వారు శుక్రవారం గుత్తి పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఆ మేరకు మధుసూదన్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

కోరిక తీర్చకుంటే చంపుతా..!

- మహిళకు లైంగిక వేధింపులు
- కేసు నమోదు

యాడికి, జూలై25(ఆంధ్రజ్యోతి): తన కోరిక తీర్చకపోతే చంపుతా అంటూ మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలానికి చెందిన మహిళ శుక్రవారం ఉదయం పొలం వద్ద పనులు చేసుకుంటుండగా లక్షుంపల్లికి చెందిన వెంకటేశ్వరరెడ్డి ఆమె వద్దకెళ్లాడు. చేయి పట్టుకుని, బలాత్కారం చేయబోయాడు. తన కోరిక తీర్చాలనీ, లేకపోతే చంపుతానని బెదిరించాడు. అతడి బారి నుంచి తప్పించుకున్న మహిళ.. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు వెంకటేశ్వరరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చీనీ టన్ను రూ.17వేలు

అనంతపురం రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా 17,500తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 1438 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

పాడి రైతుల జీవన ప్రమాణాలపై సర్వే

అనంతపురం అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాడి రైతులు, గొర్రెలు, మేకల కాపరుల జీవన ప్రమాణాలు, స్థితిగతులపై సమగ్ర సర్వే నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి జేడీ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. జిల్లాలోని 87వేల కుటుంబాలను సమగ్ర సర్వే చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు. జిల్లాలో శుక్రవారం ఈ సర్వే మొదలైందని, సెప్టెంబరు 15 దాకా కొనసాగుతుందన్నారు. స్థానిక వెటర్నరీ సిబ్బందితో ఈ సర్వే చేయిస్తున్నామన్నారు. ఆయా కుటుంబాల్లో పాడి, గొర్రెల పెంపకం ద్వారా ఎంత ఆదాయం వస్తోంది..? బ్యాంక్ నుంచి రుణం పొందారా..? ప్రభుత్వ పరంగా ఏఏ పథకాలు వర్తింప జేస్తున్నారు..? ఇంకా ఏమైనా సాయం అవసరమా..? తదితర అంశాలపై సమగ్ర సర్వే చేసి, ప్రత్యేక ప్రొఫార్మాలో పొందుపరుస్తామన్నారు. సర్వేకు పాడి రైతులు, గొర్రెల పెంపకందారులు సహకరించాలని సూచించారు.

28న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి జూనియర్ బాల, బాలికల విభాగాల్లో అథ్లెటిక్ ఎంపిక పోటీలు ఈనెల 28వ తేదీన స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ కమిటీ చైర్మన్ ఇస్మాయిల్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయిలో అండర్ 14, 16, 18, 20 బాల, బాలికల విభాగాల్లో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హతగల వారు యూనిఫాంతో హాజరుకావాలన్నారు. ఎంపికైన వారు ఆగస్టు 9వ తేదీ నుంచి బాపట్లలో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు 9052288643, 9494434767 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వామ్మో.. చిరుత..!

అనంతపురం సమీపాన సంచారం

- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- ప్రజలకు పోలీసుల జాగ్రత్తలు
- రాయదుర్గం వద్ద కొండపై మరొకటి ప్రత్యక్షం



అనంతపురం రూరల్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం/రూరల్/రాయదుర్గం రూరల్/గుమ్మఘట్ట, జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేర్వేరుచోట్ల చిరుతల సంచారం అలజడి రేపింది. అనంతపురం రూరల్ మండలంలో చీకట్లో చిరుత పరుగులు తీస్తున్న వీడియో శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. రూరల్ ఏరియాలోని బీఎస్ఆర్ కాలనీ, సదా శివ కాలనీ ప్రాంతాల వెనుక వైపున చిరుత సంచరిస్తోందంటూ స్థానిక ప్రజలు భయాందోళనకు లోనయ్యారు. దీంతో రూరల్ సీఐ శేఖర్, ఎస్ఐ రాంప్రసాద్, పోలీసు సిబ్బంది.. రాత్రి ఆయా ప్రాంతాలకు వెళ్లి గాలించారు. ప్రజలను అప్రమత్తం చేశారు. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. నాలుగు రోజుల క్రితం కూడా నరసనాయునికుంట ప్రాంతంలో కుక్కలపై చిరుత దాడి చేసిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే బీఎస్ఆర్ కాలనీ ప్రాంతానికి సైతం కుక్కల కోసం చిరుత వచ్చి ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పంపనూరు అటవీ ప్రాంతం నుంచీగానీ, ఇతర ప్రాంతాల నుంచీగానీ చిరుత వచ్చి ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ, భయపడాల్సిన అవసరం లేదని పోలీసులు సూచించారు.

కొండపై చిరుత సంచారం

రాయదుర్గం పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డు చెక్‌పోస్టు వద్ద ఉన్న కొండపై చిరుత శుక్రవారం సాయంత్రం కలకలం రేపింది. దీంతో కాలనీవాసులు భయాందోళనకు లోనయ్యారు. కొండపై పెద్ద బండరాయి వద్ద అటు.. ఇటు.. తిరుగుతూ కనిపించింది. అటవీ అధికారులు.. చిరుతను బంధించి తరలించాలని కోరారు.

గ్రామంలోకి ఆలువ

గుమ్మఘట్ట మండలంలోని తాళ్లకెర గ్రామంలోని మాల వీధిలోకి గురువారం రాత్రి వన్యప్రాణి ఆలువ వచ్చింది. మాల రామాంజనేయులు ఇంట్లోకి రాగా.. కుటుంబసభ్యులు పట్టుకున్నారు. గంప కింద ఉంచారు. శుక్రవారం రెవెన్యూ అధికారుల సాయంతో అటవీశాఖ అధికారి దామోదర్‌రెడ్డికి అప్పగించారు. పుట్టపర్తి అటవీ ప్రాంతంలో వదలి పెట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రామాంజనేయులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

స్వామీ.. నారాయణా..!

- వెలుగులోకి సబ్ రిజిస్ట్రార్ నారాయణస్వామి అక్రమాలు
- లంచమే ధ్యేయంగా రిజిస్ట్రేషన్లు
- వేరే పట్టణాలవి సైతం 'దుర్గం'లోనే రిజిస్ట్రేషన్
- ఇంకా కొనసాగుతున్న ఏసీబీ సోదాలు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొనసాగుతున్న ఏసీబీ అధికారుల సోదాలు

కళ్యాణదుర్గం/రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఏసీబీ అధికారులకు పట్టుబడిన సబ్‌రిజిస్ట్రార్ నారాయణస్వామి అవినీతి కార్యకలాపాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. తకరారు ఉన్న భూములనే టార్గెట్ చేసి, ఇక్కడే రిజిస్ట్రేషన్ చేయించి లక్షల్లో డబ్బులు గుంజినట్లు వినిపిస్తోంది. ఏసీబీ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి, ఏసీబీ సీఐ అమీద్‌ఖాన్, సిబ్బంది ఉమేశ్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నుంచి కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోదాలు కొనసాగుతున్నాయి. గత ఏడాది డిసెంబరులో కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్‌గా నారాయణ స్వామి బాధ్యతలు తీసుకున్నాడు. అప్పటి నుంచి జూలై 24 వరకు చేసిన రిజిస్ట్రేషన్‌కు సంబంధించి రికార్డులన్నీ వారు క్షుణంగా పరిశీలిస్తున్నారు. అయితే ఏసీబీ అధికారులు వివరాలు వెల్లడించడం లేదు.

తకరారు భూములకు ఇక్కడే రిజిస్ట్రేషన్

అనంతపురం, రాప్తాడు, కాళహస్తి, తిరుపతి, విజయవాడ, రాయ దుర్గం, బుక్కపట్నం, ధర్మవరం తదితర ప్రాంతాలకు చెందిన తకరారు భూములన్నింటికీ ఇక్కడే రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో సమస్యలున్న భూములు, కోర్టు వివాదంలో ఉన్న భూములను ఎక్కువభాగం ఇక్కడే రిజిస్ట్రేషన్ చేయించారన్న వాదనలు ఉన్నాయి. తకరారు ఉన్న భూములన్నీ రెండు, మూడు రోజుల్లోనే రిజిస్ట్రేషన్ చేయించి, మధ్యవర్తుల ద్వారా లక్షల్లో డబ్బులు గుంజారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటివి కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వేదికగా వందల్లో జరిగినట్లు సమాచారం. ఇలాంటివన్నీ సోదాల్లో బయట పడుతుండటంతో ఏసీబీ అధికారులే విస్తుపోతున్నారు. ఇతర ప్రాంతాల భూములను ఎందుకు ఇక్కడే రిజిస్ట్రేషన్ చేశారన్న కోణంలో వివరాలు సేకరించే పనిలో ఏసీబీ అధికారులు నిమగ్నం అయినట్లు తెలిసింది.

బాధితుడి భూమి కూడా అనంతపురంలో రిజిస్ట్రేషన్ చేయించారు

ఏసీబీకి పట్టించిన నాగేంద్రనాయక్‌ను సబ్‌రిజిస్ట్రార్ నారాయణస్వామి కళ్యాణదుర్గం కార్యాలయం చుట్టూ 20 రోజులు తిప్పుకున్నాడు. దీంతో విసుగు చెందిన ఆయన ఏసీబీని ఆశ్రయించి పట్టించినట్లు తెలిసింది. కళ్యాణదుర్గం మండలం నుసికొట్టాల తండాకు చెందిన నాగేంద్ర నాయక్ అనంతపురంలో నివాసం ఉంటున్నాడు. 252 సర్వేనెంబర్‌లో కళ్యాణదుర్గం మండలం ఒంటిమిద్దె ప్రాంతం వద్ద 1.5 ఎకరా భూమి ఉంది. ఈ భూమి అంతా అగ్రికల్చర్ ల్యాండ్ కింద వెబ్‌ల్యాండ్‌లో నమోదైంది. రిజిస్ట్రేషన్ చేయాలని సబ్‌రిజిస్ట్రార్ నారాయణస్వామిని సంప్రదించాడు. అయితే ఈ భూమి నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ కింద ఉందని, గజాల్లోకి విలువ కట్టి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కొన్ని రోజుల తర్వాత వారిద్దరి మధ్య రాజీ ఒప్పందం కుదిరింది. ఈక్రమంలోనే అనంతపురం రామ్‌నగర్‌లో ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ నెల 17న రిజిస్ట్రేషన్ చేయించాడు. రూ. ఏడు లక్షలకు బేరం కుదుర్చుకుని, రూ. 5లక్షలు ఇచ్చాడు. బాధితుడి ఫిర్యాదుతో ఏసీబీ అధికారులు వలపన్నీ పట్టుకున్నారు. ఇలా వివాదం ఉన్న భూములన్నీ కళ్యాణదుర్గం కేంద్రంగా రిజిస్ట్రేషన్ చేస్తే సమస్యలు ఉత్పన్నం అవుతాయని భావించి, తెలివిగా వేరే ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ చేయిస్తూ అక్రమాలకు పాల్పడ్డాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాగాఏసీబీ అధికారుల దాడులతో డాక్యుమెంట్ రైటర్ల కార్యాలయాలన్నీ బంద్ చేశారు.

ఆ అధికారి అవినీతిపై సమాచారం ఇవ్వండి

కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ నారాయణస్వామి అవినీతిపై సమాచారాన్ని ఇవ్వాలని ఏసీబీ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి కోరారు. 9440446190 అనే నెంబర్‌కు సమాచారం అందించాలని, వివరాలు అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

ప్రమాద నివారణ చర్యలు చేపట్టండి

- ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశం

అనంతపురం కలెక్టరేట్, జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను పరిశీలించి, ప్రమాదాలకు కారణాలు తెలుసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో రోడ్డు భద్రత జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆటోలు, ఇతర వాహనాలలో పరిమితికి మించి సరుకు రవాణా జరగకుండా అవగాహన కల్పించాలని, ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. పెండింగ్ ఉన్న జాతీయ రహదారుల పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. డ్రంకెన్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్ వెళ్లేవారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో 15,157 మోటారు వాహన కేసులు నమోదు చేశామని, రూ.20,44,095 జరిమానా విధించామని డీటీసీ వీర్రాజు తెలిపారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ మురళీకృష్ణ, ఆర్టీసీ ఆర్ఎం సుమంత్, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆ మూడింటిపై..

ప్రతి నెలా ఎఫ్‌పీ షాపులు, పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీలను తనిఖీ చేసి, ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని అధికారులను ఇన్‌చార్జి కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సీఎస్‌డీటీలు, ఎంఈఓలతో శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 65 సంవత్సరాలు పైబడిన వారికి, దివ్యాంగులకు, మంచానికే పరిమితమైనవారికి ఇంటివద్దకే వెళ్లి రేషన్ సరుకులను పంపిణీ చేసే ప్రక్రియను సకాలంలో 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు.

డీడీగా వెంకటేష్

అనంతపురం అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డీడీగా వెంకటేష్ నియమితులయ్యారు. హిందూపురం వెటర్నరీ పాలీ క్లినిక్‌లో డీడీగా పనిచేస్తున్న ఆయన్ను ఫారిన్ సర్వీస్ కింద అనంత జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డీడీగా నియమించారు. మరో మూడు రోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

డ్రిప్ మంజూరుపై దృష్టి పెట్టండి

అనంతపురం అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరుపై దృష్టి సారించాలని ఉద్యాన శాఖ కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం విజయవాడ నుంచి ఏపీఎంఐపీ రాష్ట్ర అధికారి వెంకటేశ్వర్లుతో కలిసి అన్ని జిల్లాల పీడీలు, ఏపీడీలు, డ్రిప్ కంపెనీల ప్రతినిధులతో ఆయన జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. గతేడాది పెండింగ్ పడిన డ్రిప్ పరికరాల సరఫరా, తుది పరిశీలన ప్రక్రియను నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 18వేల హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాల మంజూరు లక్ష్యాన్ని చేరుకునేలా ప్రణాళికబద్ధంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్ రెడ్డి, ఏపీడీ ధనుంజయ, డ్రిప్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచండి: డీడీ

అనంతపురం విద్య, జూలై 25(ఆంధ్రజ్యోతి): వసతి గృహాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని వార్డెన్‌లను బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారి ఆదేశించారు. విద్యార్థులు లేక చాలా వసతి గృహాలు మూసివేసే పరిస్థితి ఏర్పడుతోంది. దీనిపై 'సంక్షోభ హాస్టళ్లు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. జిల్లాలో 21 వార్డెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీకి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉన్నతాధికారులను కోరినట్లు ఆమె తెలిపారు.

రక్షణ కల్పించండి

- ఎస్పీకి ప్రేమజంట వినతి



మీడియాతో మాట్లాడుతున్న ప్రేమజంట

అనంతపురం క్రైం, జూలై25(ఆంధ్రజ్యోతి): తాము ప్రేమించి పెళ్లి చేసుకున్నామనీ, రక్షణ కల్పించాలని ప్రేమజంట.. ఎస్పీకి విన్నవించుకుంది. విడపనకల్లు మండలం పాల్తూరుకు చెందిన ఎర్రిస్వామి(24), మల్లాపురానికి చెందిన గౌతమి(22) శుక్రవారం ఎస్పీ జగదీష్‌ను కలవడానికి జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు... శివప్ప, సుంకులమ్మ దంపతుల కుమారుడు ఎర్రిస్వామి ఇంటర్ వరకూ చదువుకుని వ్యవసాయం చేస్తున్నాడు. మల్లాపురం గ్రామానికి చెందిన గోవిందు, వన్నూరమ్మ దంపతుల కుమార్తె గౌతమి డిగ్రీ వరకూ చదువుకుంది. ఇద్దరూ ఏడాదిన్నరగా ప్రేమించుకున్నారు. గౌతమికి కుటుంబీకులు ఇటీవల పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రేమికులు ఈనెల 24న ఇళ్ల నుంచి వెళ్లిపోయారు. కర్ణాటకలోని ఓ దేవాలయంలో శుక్రవారం పెళ్లి చేసుకున్నారు. విషయం తెలుసుకున్న వధువు తల్లిదండ్రులు, బంధువులు.. పాల్తూరికి వెళ్లారు. ఎర్రిస్వామి తండ్రి శివప్పను ఊరిలోని గుడి వద్దకు తీసుకెళ్లి గురువారం రాత్రి చెట్టుకు కట్టేసి కొట్టారు. ఊరి పెద్దలు వారించడంతో విడిచిపెట్టారు. విషయం తెలుసుకున్న ప్రేమ జంట శుక్రవారం ఉదయం నేరుగా అనంతపురం ఎస్పీ కార్యాలయానికి వచ్చింది. ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ... తాము ఇష్టపూర్వకంగానే పెళ్లి చేసుకున్నామన్నారు. గౌతమి కుటుంబీకుల నుంచి ప్రాణహాని ఉందనీ, రక్షణ కోరేందుకు వచ్చామని వివరించారు. తర్వాత ఎస్పీ జగదీష్‌ను కలిసి సమస్యను తెలియజేసి, వినతిపత్రం అందించారు.



రాగులపాడు వద్ద హంద్రీనీవాలోకి నీటి పంపింగ్

ఆరు మోటార్లతో ఎత్తిపోత

- జీడిపల్లికి వడివడిగా కృష్ణా జలాలు

ఉరవకొండ/బెళుగుప్ప, జూలై 25(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని రాగులపాడు 8వ పంప్‌హౌస్ నుంచి ఆరు మోటార్లతో కృష్ణా జలాలను హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా జీడిపల్లికి ఎత్తి పోస్తున్నారు. రాగులపాడు పంప్‌హౌస్‌కు ఈ నెల 22న నీరు చేరింది. దీంతో అధికారులు మూడు మోటార్లను ఆన్‌చేసి నీటిని ఎత్తిపోసిన విషయం తెలిసిందే. రెండు రోజుల నుంచి రాగులపాడు వద్ద ఆరు మోటార్లతో ఎత్తిపోతను ప్రారంభించారు. దీంతో జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 1012 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో నీటి నిల్వ 1.07 టీఎంసీలు ఉన్నట్లు వెల్లడించారు. ఈ నెలాఖరులోపు జీడిపల్లి రిజర్వాయర్‌ను నింపి, అక్కడి నుంచి పీఏబీఆర్, ఎంపీఆర్ డ్యాంకు నీటిని విడుదల చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

మరింత బాధ్యతగా పనిచేయండి

- ఉద్యోగోన్నతి ఎస్ఐలకు ఎస్పీ దిశానిర్దేశం



ఎస్పీని కలిసిన కొత్త ఎస్ఐలు

అనంతపురం క్రైం, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఉద్యోగోన్నతి పొందినవారు మరింత బాధ్యతగా పనిచేయాలని ఎస్పీ జగదీష్ సూచించారు. 1990 బ్యాచ్‌కు చెందిన 24 మంది ఏఎస్ఐలకు ర్యాంక్ ప్రమోటీ ఎస్ఐలుగా ప్రమోషన్ ఇవ్వడంతో వారు శుక్రవారం డీపీఓలో ఎస్పీ జగదీష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు త్రిలోక్‌నాథ్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన

బుక్కరాయసముద్రం, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు రానున్న ఐదు రోజుల్లో తేలికపాటి లేదా ఓ మోస్తరు వర్ష సూచన ఉన్నట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి తెలిపారు. పలు చోట్ల తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 31-33.8 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23.9-24.5 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చన్నారు. నైరుతి దిశగా గాలులు గంటకు 6కి.మీవేగంతో వీచే అవకాశముందన్నారు. గాలిలో తేమ ఉదయం పూట 63-80, మధ్యాహ్నం పూట 48-72 నమోదు అయ్యే అవకాశం ఉందన్నారు. అనంతపురం జిల్లాలో 26న 1.2 మి.మీ, 27న 0.4 మి.మీ 28న 0.6 మి.మీ, 29న 0.2 మి.మీ 30న 0.4మి.మీ కురిసే అవకాశం ఉందన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 26న 0.7 మి.మీ, 27న 0.4 మి.మీ 28న 0.6 మి.మీ, 29న 0.2 మి.మీ 30న 0.4మి.మీ కురిసే అవకాశం ఉందన్నారు.

టమోటా కిలో రూ.34

అనంతపురం రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శుక్రవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.34 ధర పలికినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠంగా రూ.17, సరాసరిగా రూ.27తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,700 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

రైలు పాక్షిక రద్దు

గుంతకల్లు, జూలై 25(ఆంధ్రజ్యోతి): అనంతపురం, గుత్తి మీదుగా వెళ్లే యశ్వంతపూర్-లక్నో వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను రెండు నెలలపాటు పాక్షికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉత్తర రైల్వేలోని లక్నో రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాం వర్కుల కారణంగా ఈ రైలును లక్నో వరకూ కాకుండా అంత్రేటియా స్టేషన్ వరకే నడపనున్నట్లు తెలిపారు. యశ్వంతపూర్-లక్నో ఎక్స్‌ప్రెస్ (నం. 22683)ను ఆగస్టు 4, 11, 18, 25, సెప్టెంబరు 1, 8, 15, 22 తేదీల్లో అంత్రేటియా వరకూ మాత్రమే నడపనున్నామన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 22684) ఆగస్టు 7, 14, 21, 28, సెప్టెంబరు 4, 11, 18, 25 తేదీల్లో లక్నో నుంచి కాకుండా అంత్రేటియా నుంచి ప్రారంభం అవుతుందన్నారు.

హంద్రీనీవా గురించి మాట్లాడే హక్కు వైసీపీకి లేదు

సుపరిపాలనలో తొలి అడుగులో ఎమ్మెల్యే పరిటాల సునీత

కనగానపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవాతో పాటు రాయలసీమలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతికహక్కు వైసీపీ నాయకులకు లేదని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మండలంలోని కేఎన్ పాళ్యం పంచాయతీ శివపురం గ్రామంలో శుక్రవారం ఆమె సుపరిపాలనలో తొలిఅడుగును నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణులతో కలి సి ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. తర్వాత ఉపాధిహామీ నిధులతో నిర్మించిన రెండు గోకులం షెడ్లను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. అన్నదాత సుఖీభవ, మహిళలకు ఆర్టీసీబస్సుల్లో ఉచిత ప్రయాణం మరో 20 రోజుల్లో అమలవుతాయని పేర్కొన్నారు. వైసీపీనాయకులు హంద్రీనీవా విషయంలో ఈ ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు ఉమ్మడి ఏపీ సీఎంగా ఉన్నప్పుడే హంద్రీనీవా ఫేజ్-1,2లకు కలిపి రూ.13,635 కోట్లకు పరిపాలన అనుమతులు ఇచ్చినట్లు గుర్తు చేశారు. అప్పట్లోనే రూ. 11,535 కోట్ల వరకు హంద్రీనీవాకు ఖర్చుచేసినట్లు చెప్పారు. కనుక ఈ ప్రాజెక్టు గురించి మాట్లాడే హక్కు వారికి లేదని అన్నారు. డీసీఎంఎస్, మార్కెట్‌యార్డ్‌చైర్మన్లు నెట్టెం వెంకటేశ్, సుధాకర్‌చౌదరి, టీడీపీ మండల కన్వీనర్ పోతలయ్య, నాయకులు అంజినప్ప, బిల్లేదాము, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


శివపురంలో ప్రజలకు కరపత్రాలను అందిస్తున్న పరిటాల సునీత

మృతుల కుటుంబ సభ్యులకు పరామర్శ

కనగానపల్లి: మండలకేంద్రంలో వివిధ కారణాలతో మృతిచెందిన వారి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పరిటాలసునీత పరామర్శించారు. టీడీపీ నాయకులు చల్లా సుబ్బరాయుడు, గొల్లరామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు బిల్లేభాస్కర్ తండ్రి గురుగు లక్ష్మన్న వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందారు. దీంతో మృతుల కుటుంబసభ్యులను ఇళ్ల వద్దకు వెళ్లి ఎమ్మెల్యే పరామర్శించారు. గొల్లరామకృష్ణ కుటుంబసభ్యులకు రూ.20వేల ఆర్థికసాయం చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రామగిరి: నియోజకవర్గంలో ఏడుగురు లబ్ధిదారులకు రూ. 5.11లక్షల సీఎంరిలీఫ్ ఫండ్ మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే పరిటాల సునీత వెంకటాపురంలోని తన స్వగృహంలో లబ్ధిదారులకు, వారి కుటుంబసభ్యులకు అందజేశారు. టీడీపీ రామగిరి, సీకేపల్లి మండలాల కన్వీనర్లు సుధాకర్, ముత్యాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


కొండన్న ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ తదితరులు

తండ్రి కొండన్నకు ఘన నివాళులు..

రామగిరి: ఎమ్మెల్యే పరిటాల సునీత తండ్రి ధర్మవరపు కొండన్న వర్ధంతిని మండలంలోని వెంకటాపురంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఘాట్ వద్ద ఎమ్మెల్యేతో పాటు టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్, కొండన్న సతీమణి సరస్వతమ్మ, కుమారులు బాలాజీ, మురళీ, ఇతర కుటుంబసభ్యులు, శ్రేయోభిలాషులు ఘన నివాళులర్పించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత తన తండ్రితో ఉన్న జ్ఞాపకాలను గుర్తుకు చేసుకున్నారు. చిన్నప్పటి నుంచి ఆయన ఇచ్చిన ప్రోత్సాహం వల్లనే తాను ఈ స్థాయికి వచ్చానన్నారు. భర్త పరిటాల రవి మరణం సమయంలో తన తండ్రి తనకు ఎంతో అండగా నిలిచి మనోధైర్యాన్ని ఇచ్చారని తెలిపారు. తన ప్రోత్సాహం ఎన్నటికీ మరువలేనని అన్నారు. తర్వాత పెద్దఎత్తున అన్నదానం చేశారు. పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు.

ఏడాదిలోనే దేశం గర్వించేలా అభివృద్ధి

- అది చూసి ఓర్వలేకే వైసీపీ విమర్శలు
- ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్


ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం క్రైం, జూలై 25(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే దేశం గర్వించే స్థాయిలో సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. నగరంలోని 13వ డివిజన్‌లో గల ఉమానగర్‌లో శుక్రవారం ఆయన సుపరిపాలనలో తొలిఅడుగు నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేశారు. కొందరు స్థానికులు పలు సమస్యలను తెలపగా.. త్వరగా పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ.. దేశం గర్వించే స్థాయిలో సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. దానిని చూసి ఓర్వలేకే వైసీపీ వారు అనేక విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో సాగిన మద్యం స్కాంపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన సిట్ తగిన ఆధారాలతో ముందుకెళుతోందన్నారు. త్వరలోనే పెద్ద తలకాయలు బయటకు వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణస్వామి, కాశీ విశ్వనాథ్, నర్మదా, నాయుడమ్మ, రామకృష్ణ, సురేష్, నాగార్జున, బుగ్గయ్య చౌదరి, గంగారామ్, సరిపూటి రమణ, నరసింహులు, పరమేశ్వర్, కడియాల కొండన్న,బొమ్మినేని శివ, దళవాయి వెంకటనారాయణ, సంగా తేజస్విని, సాకే లక్ష్మీనరసింహ, సుధాకర్‌యాదవ్, తొండపునాటి రమేష్, మధు, బాబా, బాలాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

లా కళాశాల అభివృద్ధి అభినందనీయం


మాట్లాడుతున్న ముఖ్య అతిథి

అనంతపురం రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): సొంత ఆర్థిక వనరులతో కళాశాలను అభివృద్ధి చేసుకోవడం అభినందనీయమని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రెక్టార్ వెంకటనాయుడు అన్నారు. నగరంలోని విజయనగర్ లా కళాశాలకు నాక్ గ్రేడ్ రావడం పట్ల శుక్రవారం అదే కళాశాలలో అభినందన సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా వెంకటనాయుడు హాజరై మాట్లాడారు. కళాశాలకు నాక్ గ్రేడ్ దక్కడం సంతోషంగా ఉందన్నారు. కళాశాలలో ఉన్న మౌలిక సదుపాయాలు, ప్రమాణాలను పరిగణించిన తరువాతే నాక్ గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రైవేట్ యాజమాన్యం సొంత ఆర్థిక వనరులతో వీటిని సమీకరించుకోవడం విశేషమన్నారు. కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపక కార్యదర్శి రామిరెడ్డి, నాక్ కోర్డినేటర్ నటరాజ్, ఎన్‌డయాగ్నస్టిక్ మేనేజింగ్ డైరెక్టర్ నిఖిలేంద్రరెడ్డి, కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాఘవేంద్రచార్, వైస్ ప్రిన్సిపాల్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రజల ఆత్మగౌరవం తాకట్టు: సీపీఐ

అనంతపురం రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ.. దేశ ప్రజల ఆత్మగౌరవాన్ని అమెరికా అధ్యక్షుడి కాళ్ల కింద తాకట్టు పెట్టారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున ఆరోపించారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం రాప్తాడు నియోజకవర్గం నాయకుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా మల్లికార్జున హాజరై మాట్లాడారు. దేశంలోని అడవుల్లో ఉన్న సంపదను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసేందుకు మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని మండిపడ్డారు. బూటకపు ఎన్‌కౌంటర్లు ఆపి మావోయిస్టులను శాంతి చర్చలకు పిలవాలన్నారు. అలాగే కడపలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు.. రాష్ట్రప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 31న రూరల్ మండలం కందుకూరులో రాప్తాడు నియోజకవర్గ మహాసభ జరగనుందని, జయప్రదం చేయాలని పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ, సహాయకార్యదర్శి శ్రీకాంత్, రూరల్ మండల కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శులు నరేష్, శివ చలపతి, ఏఐవైఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

రామగిరి, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో వైద్య సిబ్బంది పారిశుధ్య చర్యల్లో దోమల నివారణకు శుక్రవారం మిలాథిన్ స్ప్రే చేయించారు. కానగులకుంట, కంచికుంట, ఆర్‌కొత్తపల్లి, సుద్దకుంటపల్లి, కుంటిమద్ది తదితర గ్రామాలలో ఇంటింటికీ స్ప్రే చేయించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి జయరాంనాయక్, ఎంపీహెచ్‌ఏ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి ఇబ్రహీం, అంగన్‌వాడీ టీచర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మహిళా కార్మికులకు చీరల పంపిణీ


చీరలు అందజేస్తున్న అధికారులు, నిర్మలమురళి

అనంతపురం వైద్యం, జూలై 25(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసాన్ని పురష్కరించుకుని నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం మహిళా పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ నిర్వహించారు. ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ నిర్మలమురళి ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బెనిడిక్ట, సర్వజన వైద్యశాల ఆర్ఎంఓ డాక్టర్ హేమలత ముఖ్య అతిథులుగా హాజరై చీరలను పంపిణీచేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సురేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల్ని సామరస్యంగా పరిష్కరించుకోండి

గార్లదిన్నె, జూలై 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆర్డీఓ కేశవనాయుడు రైతులకు సూచించారు. యర్రగుంట్ల గ్రామంలో గత కొంతకాలం నుంచి ఇరువురు రైతులు భూ సమస్యతో గొడవ పడుతున్నారు. దీంతో ఆర్డీఓ తో పాటు తహసీల్దార్ బండారు ఈరమ్మ శుక్రవారం గ్రామానికి వెళ్లి ఇరువురికి రైతులకు సంబంధించిన భూమిని పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎక్కువగా భూ సమస్యలు వస్తున్నాయన్నారు. వాటిని రైతులు గొడవలకు పోకుండా సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. అలాగే అక్కడ పొలంలోకి వెళ్లే దారి కోసం పలువురి రైతులకు కొంతకాలం గొడపడుతున్నారు. ఆర్డీఓ ఆ ఇరువురి రైతులతోనూ మాట్లాడారు.


దారి సమస్యపై రైతులతో చర్చిస్తున్న ఆర్డీఓ కేశవనాయుడు

సలకంచెరువు ఎస్‌బీఐ వద్ద ఆందోళన


ఆందోళన చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, బాధితులు

శింగనమల, జూలై 25(ఆంధ్రజ్యోతి): పలువురు విద్యార్థుల తల్లుల ఖాతా ల్లో ఇటీవల రాష్ట్రప్రభుత్వం జమ చేసిన త ల్లికి వందనం డబ్బు ల ను మండలంలోని సల కం చెరువు ఎస్‌బీఐ అధికారులు పాత అప్పుల కింద జమ చేసుకున్నారు. దీంతో బాధితులు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆబ్యాంకు వద్ద ఆందోళన చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, నాయకుడు తరిమెల భాస్కర్ మాట్లాడుతూ.. ఎస్‌బీఐ అధికారులు తల్లికి వందనం డబ్బులను అనుమతులు లేకుండా పాత అప్పుల్లోకి ఎలా జమ చేసుకుంటారని ప్రశ్నించారు. ఆ డ బ్బును అప్పుల్లోకి జమ చేయకుండా తల్లులకు వెంటనే తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు పెద్ద ఎత్తున చేస్తామని హెచ్చరించారు. అక్కడ వంటా వార్పు నిర్వహించేందుకు ప్రయత్నాలు చేయగా పోలీసులు అడ్డుకున్నారు. నాయకులు సూర్యప్రకాశ్, శ్రీనివాసులు, రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతుకు తీవ్రగాయాలు

గార్లదిన్నె, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవపురం గ్రామానికి చెందిన రైతు సోంపల్లి చంద్రశేఖర్ గురువారం విద్యుత్‌షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన గ్రామ సమీపంలోని చీనీతోటకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. అక్కడ బోరుమోటార్ ఆన్ చేయగా ప్రమాదవశాత్తూ విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. గమనించిన సమీప పొలాల రైతులు వెంటనే వచ్చి మోటార్‌ను ఆఫ్ చేసి అతడిని చికిత్స నిమిత్తం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రైతు చికిత్స పొందుతున్నాడు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

అనంతపురం వైద్యం, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం సమాచార హక్కుచట్టంపై చైతన్య వేదిక, ఫైట్ ఫర్ రైట్స్ సంస్థల సంయుక్తాధ్వర్యంలో అధికారులకు, సిబ్బందికి అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ పీడీ ఎం.నాగమణి హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శక పాలన అందించి, ఆ విషయాన్ని ప్రజలకు తెలిపేందుకు సమాచార హక్కు(ఆర్టీఐ)చట్టాన్ని రూపొందించారని తెలిపారు. సంస్థ ప్రతినిధులు రాయల కొండయ్య, ప్రసాద్, ఏపీ రాజు మాట్లాడుతూ ప్రభుత్వ సమాచారం కోసం పౌరుల అభ్యర్థనలకు ఆర్టీఐ నిబంధనల మేరకు అధికారులు సకాలంలో స్పందించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓలు అనురాధమ్మ, ఉమశంకరమ్మ, భారతి, శ్రీదేవి, లలితమ్మ, షాజిదాబేగం, లక్ష్మీప్రసన్న, యల్లమ్మ, నాగమణి, పద్మావతిదేవి, కార్యాలయ అధికారులు , చైత్యవేదిక, ఫైట్‌ఫర్ రైట్స్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

● అనంతపురం అర్బన్: జిల్లా పట్టు పరిశ్రమ కార్యాలయంలో ఆ శాఖ అధికారులు, సిబ్బంది, రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సమాచార హక్కు పరిరక్షణ సంఘం ప్రతినిధి వన్నూరప్ప సమాచార హక్కు చట్టం ఆవశ్యకత.. అమలు విధానంపై తెలియజేశారు. పట్టుపరిశ్రమ శాఖ ఏడీ విజయ్‌కుమార్, ఎస్‌ఓలు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, టీఓలు, టీఏలు, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నేకొత్తపల్లి,జూలై 25(ఆంధ్రజ్యోతి):మండలంలోని హరియన్‌చెరువు, ఎన్‌ఎస్‌గేటు, వెంకటంపల్లి, మేడాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ డీఈఈ లక్ష్మీనారాయణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. రామగిరి 220 కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్‌మరమ్మతు పనుల కారణంగా ఉదయం 10 నుంచి సాయంత్రం5గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చెప్పారు. ప్రజలు సహకరించాలని కోరారు.

సీఎం, డీసీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం


చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

అనంతపురంరూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిండికేట్ నగర్‌లో గల టీడీపీ కార్యాలయంలో శుక్రవారం సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే పరిటాల సునీత చిత్రపటాలకు నూర్‌బాషా దూదేకుల కులస్థులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ దూదేకుల ఫెడరేషన్ సాధికార సమితి రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షుడు అల్లీపీరా మాట్లాడుతూ.. నిన్నటి రాష్ట్ర కేబినెట్ సమావేశంలో మైనార్టీలు, అత్యంత వెనుకబడిన నూర్ బాషా దూదేకుల కులం అభ్యున్నతికి పెద్దపీట వేస్తూ పలు నిర్ణయాలు తీసుకోవడం హర్షణీయమన్నారు. ముఖ్యంగా రాష్ట్ర నూర్‌బాషా దూదేకుల ఆర్థిక సంస్థను నెలకొల్పుతూ మంత్రి మండలి ఆమోదం తెలపడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నూర్‌బాషా, దూదేకుల కులస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలని వినతి

అనంతపురంరూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వేమన కోరారు. ఈ మేరకు శుక్రవారం వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబును కలసి వినతి అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఫార్మసీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో విద్యా ప్రమాణాలు దిగజారుతున్నాయన్నారు. అనేక విభాగాల్లో అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రయోగశాలల్లో సరైన పరికరాలు లేవన్నారు. వాటన్నింటినీ పరిష్కరించి నాణ్యమైన విద్యనందించాలని కోరారు. నైపుణ్యాభివృద్ధికి వర్క్‌షాప్‌లు నిర్వహించాలన్నారు. వర్సిటీ కార్యదర్శి కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గార్లదిన్నె, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం సోకుతున్న సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు దిలీప్, అనిషా సూచించారు. మండలంలోని మర్తాడు గ్రామంలో శుక్రవారం వారు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రస్తుతం వర్షాలకు తేమ ఉండడంతో దోమలు వ్యాప్తి అధికమై డెంగ్యూ, చికున్‌గన్యా, మలేరియా, మెదడువ్యాపు తదితర వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. అవి సోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇళ్ల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలన్నారు. రాత్రి సమయంలో వేపాకు పొగ వేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ కాచిన నీరు తాగాలని సూచించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేద కుటుంబాన్ని ఆదుకుంటాం: తహసీల్దార్

ఆత్మకూరు జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కన ఓనిరుపేద కుటుంబం కట్టుకుంటున్న తాత్కాలికి ఇంటిని ఉన్నతాధికారుల ఆదేశాలతో శుక్రవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. కాగా బాధితులకు అన్యాయం జరగకుండా వెంటనే వారికి అనువైన చోట ఇంటిపట్టా ఇస్తామని తహసీల్దార్ లక్ష్మీనాయక్ భరోసా ఇచ్చారు. రెండురోజుల్లో ఆ నిరుపేద కుటుంబాని కి పట్టా మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. టీడీపీ కన్వీనర్ మండల శ్రీనివాసులు, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, సాధికార కమిటీ సభ్యుడు మంగళి ఆనంద్ బాధితులకు అండగా నిలిచి న్యాయం చేయాలని తహసీల్దార్‌కు విన్నవించారు. దీంతో స్పందించిన ఆయన పట్టా ఇచ్చి పక్కాగృహం మంజూరుకు కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో బాధిత కుటుంబం ఆనందం వ్యక్తం చేసింది.

పేద కుటుంబాల సాధికారతే లక్ష్యం

- అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి
- సీఎంతో పీ-4పై సమీక్ష


సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే, కమిషనర్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాలను ఉన్నత స్థాయికి తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. రాజధాని అమరావతి నుంచి పీ-4 సర్వేపై శుక్రవారం సీఎం చంద్రబాబు వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామితో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. కాన్ఫరెన్స్‌లో సీఎం పీ-4 లోగో ఆవిష్కరించి పలు సూచనలు చేశారని, వాటిని అమలు చేయాలని తెలిపారు. పేదరిక నిర్మూలనకు ముఖ్యమంత్రి తీసుకువచ్చిన పీ-4 విధానాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. దేశ, విదేశాల్లో ఉన్నతస్థాయిలో ఉన్న వారు పేద కుటుంబాల ను దత్తత తీసుకుని అభివృద్ధి చేసేలా ప్రోత్సహించాలన్నారు. సీఎం తన సొంత నియోజకవర్గం కుప్పంలో 250 కుటుంబాలను దత్తత తీసుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ హరికుమార్, ఎంపీడీఓ దివాకర్, ఏఎంసీ ఎస్ఈ రాజశేఖర్, పీ4 సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

పీ-4పై ప్రజలకు అవగాహన అవసరం

అనంతపురం క్లాక్‌టవర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీ-4 సర్వేపై ప్రజలకు కనీస అవగాహన అవసరమని టీడీపీ నాయకులు తెలిపారు. సచివాలయం స్థాయిలో పేదలకు పీ-4 ప్రాధాన్యత, అమలు తీరుపై, మార్గదర్శకుల పాత్రపై అవగాహన కల్పించేందుకు నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఏఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక 69 వార్డు సచివాలయంలో పీ-4పై అవగాహన కల్పించారు. టీడీపీ మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వప్న, కో కన్వీనర్ దళవాయి మహేశ్వరి, 48వ డివిజన్ అధ్యక్షుడు కృష్ణ పాల్గొని పీ-4 పై ప్రజలకు అవగాహన కల్పించారు. పేదల జీవితాలను ఉన్నత స్థానాల్లోకి చేర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో 69వ వార్డు సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ లక్ష్మీనారాయణ, ఎడ్యుకేషన్ సెక్రటరీ పర్వతరెడ్డి, వీఆర్‌ఓ జబీనా, బూత్ కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హత ఆధారంగా ఉద్యోగోన్నతులు ఇవ్వాలి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులకు అర్హత ఆధారంగా పదోన్నతులు కల్పించాలని జిల్లాకు చెందిన ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శులు హనుమంతు, సాంబశివమ్మ కోరారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేఆర్ సూర్యనారాయణ, రమేష్‌కుమార్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం వారు రాజధాని అమరావతిలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. జీఓ నంబరు 523 సవరించి సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని, అలాగే ఆ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, పాలిటెక్నిక్ ఉద్యోగుల పెండింగ్‌లో ఉన్న బకాయిలు విడుదల చేయాలని విన్నవించారు.

దుకాణాలపై అధికారుల మెరుపు దాడులు

12 షాపులకు రూ.1.66 లక్షల జరిమానా


నగరంలోని ఓ దుకాణంలో జరిమానా విధిస్తున్న అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్లాస్టిక్ విక్రయిస్తున్న దుకాణాలపై నగరపాలక సంస్థ అధికారులు శుక్రవారం మెరుపు దాడులు నిర్వహించారు. 12 ప్లాస్టిక్ షాపులపై అధికారులు 12 బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో దాడులు చేశారు. ఒక్కో బృందంలో ఒక ఇంజనీరు, ఇద్దరు శానిటేషన్ సెక్రటరీలు, ఇద్దరు అమెనిటీలు ఉన్నారు. ఉదయం 11.30గంటలకు 12 షాపులపై దాడులు నిర్వహించారు. నగరంలో పారిశుధ్య చర్యల్లో భాగంగా.. కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను దృష్టిలో ఉంచుకుని, ప్రజారోగ్యం దృష్ట్యా కలెక్టర్ ఆదేశాల మేరకు దాడులు చేసినట్లు నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి తెలిపారు. ఆకస్మిక దాడులు కొనసాగుతాయని, ప్లాస్టిక్ నిషేధంపై అమలు పటిష్టం చేస్తామని, మొదటిసారి పట్టుబడితే చర్యలు తీసుకుంటామని, రెండోసారి పట్టుబడితే రూ.40వేలు జరిమానాతో పాటు షాపు మూతవేస్తామని హెచ్చరించారు. 12 షాపుల దాడుల్లో రూ.1.66లక్షలు జరిమానాతో పాటు ఒకటిన్నర టన్ను ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

వ్యాపారుల నిరసన

ప్లాస్టిక్ నిషేధం పేరుతో నగరపాలక సంస్థ అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని ప్లాస్టిక్ వ్యాపారులు వాపోయారు. నగరంలోని పలు షాపులపై నగరపాలక సంస్థ అధికారులు దాడులు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం వారు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. పలువురు మాట్లాడుతూ.. అధికారులు తమ దుకాణాలపై దాడులు చేసి ప్లాస్టిక్ కాని వస్తువులను తీసుకెళ్తున్నారని, ఇది సబబు కాదన్నారు. ఈ విషయంపై ఇప్పటికే కలెక్టర్, కమిషనర్‌ను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నామని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి వేధింపులను ఆపాలని కోరారు.

నాటుసారాపై ప్రత్యేక దృష్టి సారించాలి

చెన్నేకొత్తపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): నాటుసారా నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సూచించారు. చెన్నేకొత్తపల్లిలోని ఎక్సైజ్ కార్యాలయాన్ని అసిస్టెంట్ ఎక్సైజ్‌సూపరింటెండెంట్ శ్రీరామ్‌తో కలిసి శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టిన నవోదయం2.0 కార్యక్రమంలో భాగంగా ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఎక్కడా నాటు సారా లేకుండా చూడాలన్నారు. ఎక్సైజ్ నేరాల్లో ఉన్న వారిపై నిఘా పెంచాలని, వారిని బైండోవర్ చేయాలని ఎక్సైజ్ సీఐ ఫరూక్‌అజాంను ఆదేశించారు. ముఖ్యంగా ఎమ్మార్పీకే మద్యం విక్రయాలు జరగాలని, మద్యం షాపుల్లో ఎటువంటి అక్రమాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ శివప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ శంకరనాయక్, సిబ్బంది ఉన్నారు.

గౌతు లచ్చన్న జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

అనంతపురం రూరల్,జూలై25(ఆంధ్రజ్యోతి): సర్దార్ గౌతులచ్చన్న జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలని ఈడిగ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో జైలు జీవితం గడిపిన వ్యక్తి గౌతులచ్చన్న అని తెలిపారు. రైతుల కోసం శ్రీకాకుళం నుంచి మద్రాస్ వరకు పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. ఆగస్టు16న ఆయన జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. నాయకులు ఈడిగ వేణుగోపాల్, నాగభూషణం, లాలప్ప, సూరిబాబు, నారాయణస్వామి, శ్రీరాములు, ప్రసాద్, జగదీష్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయాలి

శింగనమల, జూలై25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్ద కే వెళ్లి రేషన్ సరుకులను పంపిణీ చేయాలని సీఎస్‌జీటీ చంద్రకళ డీలర్లకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారంఆమె మండల డీలర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి నెల 1 నుంచి 15 వ తేదీ వరకు రేషన్ పంపిణీ చేయాలని, వృద్ధుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రేపు చందన షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవం

అనంతపురం టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సూర్యనగర్ 80 అడుగుల రోడ్డులో చందన ఫ్యామిలీ షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ షాపింగ్ మాల్ ఎండీ మావూరి శ్రీనివాసరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, వైద్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, పరిటాల సునీత, బండారు శ్రావణిశ్రీ, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, నగరపాలకసంస్థ మేయర్ వసీమ్, అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. హరిహర వీరమల్లు సినిమా హీరోయిన్ నిధి అగర్వాల్ చేతులమీదుగా జ్యోతి ప్రజ్వలన చేస్తారని తెలిపారు. ప్రజలతో 4 దశాబ్దాల అనుబంధమున్న చందన సంస్థ ఇపుడు సరికొత్త రూపంలో చందన షాపింగ్‌మాల్ పేరుతో అనంతపురం నగరంలో ప్రారంభం కానుందని ఆయన పేర్కొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

బుక్కరాయసముద్రం, జూలై25(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలపాలకు అడ్డుకట్టు వేసేందుకు ప్రత్యేక నిఘా ఉంచినట్లు శక్తి టీం సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రంలోని చెరువుకట్ట ప్రాంతంలో అసాంఘిక కార్యకలపాలు జరుగుతున్నాయని సమాచారం అందడంతో శుక్రవారం ఆయన ఆ ప్రాంతంలో ప్రత్యే నిఘా వేసి డ్రోన్ కెమెరాలతో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేరాల నియంత్రణకు పోలీసు యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. శివారు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఎక్కడైనా అ సాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే... చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇకపై పట్టణ శివారు ప్రాంతాలలో రోజూ డ్రోన్ కెమెరాలతో పకడ్బందీగా పర్యవేక్షణ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.


చెరువు కట్ట పై డ్రోన్ కెమెరాతో నిఘా పర్యవేక్షిస్తున్న శక్తి టీం సీఐ, సిబ్బంది

ఎరువుల దుకాణాలపై చర్యలు తీసుకోండి

కణేకల్లు, జూలై 25(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు, ఎరువులు, రసాయనిక మందులు విక్రయిస్తున్న ఎరువుల దుకాణాలపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ రైతు సంఘం కార్యదర్శి తిప్పేస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన తనిఖీలకు వస్తే తలుపులు మూసే అనే వార్తపై అధికారులకు నేరుగా ప్రశ్నలు సంధించారు. మండల వ్యాప్తంగా కొంతమంది దుకాణదారులు నకిలీ ఎరువులతో పాటు రసాయనిక మందులను కర్ణాటకతో పాటు ఇతర ప్రాంతాల్లో చౌకగా కొనుగోలు చేసి అధిక మొత్తంలో విక్రయిస్తూ రూ. కోట్లు గడుస్తున్నారన్నారు. కానీ స్థానిక వ్యవసాయాధికారులు, జిల్లా అధికారులు వీటిని చూసీచూడనట్లు వ్యవహరించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తనిఖీలు అధికారులు వస్తే దుకాణాదారులు షాపులను మూసుకుని వెళ్లిపోవడం చూస్తుంటే ఈ ప్రాంత రైతులను ఫర్టిలైజర్ దుకాణాదారులు నిండుగా మోసం చేస్తున్నారని అర్థమవుతోందన్నారు. రైతులకు ఇంత మోసం జరుగుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం శోచనీయమన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, స్థానిక అధికారులు అలాంటి దుకాణాలను సీజ్ చేయాలని, లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

సమావేశానికి అధికారుల డుమ్మా

కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని సభ్యుల తీర్మానం


అధికారులతో వాదిస్తున్న విడపనకల్లు సర్పంచ్

విడపనకల్లు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మూడు నెలలకు ఓ సారి నిర్వహించే సమావేశాలకు అధికారులు హాజరు కాకా పోతే ఇక వీటిని నిర్వహించడం ఎందుకు అని అధికారుల తీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు కావాలనే ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలని ఇలా చేస్తున్నారని మండిపడ్డారు. వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని తీర్మానం చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ కరనం పుష్పావతి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి తహసీల్దారు, వ్యవసాయ అధికారి, విద్యుత్ అధికారి, విద్యాశాఖ అధికారులు ఇద్దరు, ఆర్ అండ్ బీ అధికారులు, ఆర్‌టీసీ అధికారులు, జీబీసీ అధికారులు, మైనర్ ఇరిగేషన్ అధికారులు, సోషల్ వెల్ఫేర్ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు, దాదాపుగా 10 శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. దీనిపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు రాకపోతే మండల సమస్యలు ఎవరికి తెలపాలని వాపోయారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు హనుమంతు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు ఎంపీడీఓ షకీలాబేగం, ఈఓఆర్డీ సత్యబాబు, ఏఓ భాస్కర్‌బాబు, వైద్యులు నరేష్ కుమార్, పుష్ప పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ భూముల పరిశీలన

శెట్టూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంతనహళ్లి, ములకలేడు రెవెన్యూ కనుకూరు గ్రామ పరిధిలోని అగ్రిగోల్డ్ భూములను సీఐడీ బృందం ఎస్ఐ జగదీశ్వర్‌రెడ్డి తన బృందంతో కలిసి శుక్రవారం పరిశీలించారు. వారి వెంట తహసీల్దార్ ఈశ్వరమ్మ, గౌతమ్, వీఆర్వో లేపాక్షి, విలేజ్ సర్వేయర్ నీరజ ఉన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

తాడిపత్రి, జూలై 25(ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేద్కర్ నగర్‌కు చెందిన పలువురు బీజేపీలో శుక్రవారం చేరారు. వీరిని స్థానిక బీజేపీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, కర్నూలు జిల్లా ఇన్‌చార్జి అంకాల్‌రెడ్డి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జానే

నకిలీ పట్టాలతో ఆక్రమణలు.. విక్రయాలు


చదును చేసి రాళ్లను పాతిన దృశ్యం, వంక పక్కన చదును చేసిన స్థలం

ఉరవకొండ, జూలై 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీలో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేస్తున్నారు. అంతటితో ఆగకుండా దర్జాగా స్థలం తమదే అంటూ రాళ్లు పాతేస్తున్నారు. సర్వే నెంబర్ 552లో 2003లో టీడీపీ హయాంలో 1,020 మందికి పట్టాలు ఇచ్చారు. శివరామిరెడ్డి కాలనీ జాతీయ రహదారికి ఆనుకొని ఉండడంతో పాటు ఇటీవల కాలనీ విస్తరించడంతో ఇక్కడ స్థలాలకు భారీ డిమాండ్ వచ్చింది. సెంట్ ఏకంగా రూ.4 లక్షల దాకా పలుకుతోంది. ఈ కాలనీలో పెద్ద మొత్తంలో పట్టాల మార్పిడి జరిగినట్లు తెలుస్తోంది. కాగా, కొందరు నకిలీ పట్టాలు సృష్టించి స్థలాలను ఆక్రమించుకున్నారు. గురుకుల పాఠశాలకు వెళ్లే రహదారిలో ఖాళీ స్థలాన్ని చదును చేసి, రాళ్లను కూడా పాతారు. వంకలను సైతం వదలకుండా ఆక్రమించుకున్నారు. వంక పక్కన స్థలాన్ని కూడా చదును చేసి ఆక్రమించుకున్నారు. ఒకే పట్టా నెంబర్ మీద పట్టాలు సృష్టించి, అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ రికార్డుల్లో 1020 మంది ఉంటే... అక్కడ పట్టాల సంఖ్య 1100 దాకా చేరింది. అంటే సుమారు వందకు పైగా నకిలీ పట్టాలు ఉన్నట్లు సమాచారం. రెవెన్యూ అధికారులు హడావుడి చేస్తున్నారు తప్పా.. ఆక్రమణదారులపై ఇంతవరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దీనిపై తహసీల్దారు మహబూబ్‌బాషాను వివరణ కోరగా ఆక్రమణల విషయం తన దృష్టికి రాలేదని, విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

భక్తులకు ఏ లోటూ రానివ్వకండి


సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీఓ

గుంతకల్లు, జూలై 25(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా కసాపురం దేవస్థానానికి తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా వివిధ శాఖల వారు చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రావణ మాసంలో మంగళ, శనివారాల్లో వేలాది మంది భక్తులు తరలి వస్తారని, వారికి తాగునీరు, వసతి, వైద్య సహకారం, దొంగల అదుపునకు పోలీసుల గస్తీ, రద్దీ నియంత్రణకు వలంటీర్లు నిర్విరామంగా పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, ఆలయ ఈఓ కే వాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హనుమాన్ దర్శన్‌ను వినియోగించుకోండి

యల్లనూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ఏర్పాటు చేస్తున్న హనుమాన్ దర్శన్ బస్సులను భక్తులు వినియోగించుకోవాలని తాడిపత్రి డిపో మేనేజర్ మురళీధర్ శుక్రవారం కోరారు. శ్రావణమాసంలో ఒకేరోజు కసాపురం, మురడి, నేమకల్లు ఆంజనేయస్వామిని భక్తులు దర్శించుకోవడం కోసం తాడిపత్రి డిపో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అక్రమ మద్యం ధ్వంసం

కణేకల్లు, జూలై 25(ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న దాదాపు రూ.1.76 లక్షల విలువగల కర్ణాటక మద్యాన్ని ఈఎస్ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం ధ్వంసం చేశారు. కార్యక్రమంలో సీఐ ఉమాబాయి, జయనాథ్‌రెడ్డి, ఎస్ఐ షేక్షావలి, నాగరాజు పాల్గొన్నారు.

కూలీలకు తీవ్రగాయాలు


విరిగిన వేరుశనగ యంత్రం రాడ్

బొమ్మనహాళ్, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందవాడ, తార్కపురం గ్రామాల మధ్య శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. రైతు చెన్నప్ప పొలానికి వేరుశనగ యంత్రాన్ని మల్రేగౌడ అనే వ్యక్తి ట్రాక్టర్ ద్వారా తీసుకొని బయలుదేరాడు. ఆ యంత్రంపైనే గోవిందవాడకు చెందిన కూలీలు వండ్రమ్మ, రామలింగ, గణేష్, శీనా, రామంజినేయులు, కిరణ్ మరో నలుగురు ఇరువైపులా కూర్చున్నారు. ట్రాక్టర్‌కు యంత్రానికి మధ్య ఉన్న రాడ్ కట్ కావడంతో.. కూలీలు అందరూ కిందపడ్డారు. స్థానికులు వారిని ఉరవకొండ ఆసుపత్రికి తరలించారు. వీరిలో వండ్రమ్మ, రామలింగ, శీనా, గణేష్ తీవ్రంగా గాయపడటంతో వారిని అనంతపురం ఆసుపత్రికి తరలించారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందితే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ నబీరసూల్ తెలిపారు.

అదుపుతప్పిన స్కూల్ బస్సు


పొలాల్లోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

విడపనకల్లు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరులో విద్యార్థులతో వెళ్తున్న ఓ ప్రవేటు పాఠశాల బస్సు అదుపు తప్పి పొలాల్లోకి వెళ్లి ఓ వైపు ఒరిగింది. ఉరవకొండలోని ఉషోదయ పబ్లిక్ పాఠశాలకు చెందిన బస్సు శుక్రవారం ఉదయం పాల్తూరు గ్రామానికి వెళ్లి 20 మంది విద్యార్థులను ఎక్కించుకుని ఉరవకొండకు బయలు దేరింది అన్నారు. పాల్తూరు-ఉరవకొండ రోడ్డును వెడెల్పు చేసే పనులు నిర్వహిస్తున్నారు. పాల్తూరు గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను తప్పించే ప్రయత్నంలో ఆ బస్సు అదుపు తప్పి రోడ్డు దిగి.. పొలం గట్టును ఢీకొని.. ఓ పక్కకు ఒరిగి ఆగిపోయింది. పిల్లలకు ఎలాంటి గాయాలూ కాలేదు. బస్సు కొద్దిగా వేగంగా వెళ్లి ఉంటే పక్కనే ఉన్న వంకలోకి బోల్తా పడి.. తీవ్ర ప్రమాదం జరిగి ఉండేది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

పాత పనులే అప్పగించాలి

రాయదుర్గంరూరల్, జూలై25 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలో ఇంజనీరింగ్ కార్మికులకు పాత పద్ధతిలోనే యధావిధిగా వారికి పాత పనులను అప్పగించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బీ మల్లికార్జున డిమాండ్ చేశారు. ఆ కార్మికుల పనులను మార్పులు చేస్తూ మున్సిపల్ కమిషనర్ తీసుకున్న నిర్ణయం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు శుక్రవారం చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్ ఈ కక్ష సాధింపు చర్యలను మానుకో కుంటే పోరాటాలను కొనసాగిస్తామని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

యాడికి, జూలై 25(ఆంధ్రజ్యోతి): వేములపాడు జాతీయ రహదారి వద్ద ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు స్పెషల్ టీం పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి.. ఆ ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత


చెక్కులు అందుకున్న వారిలో విప్ కాలవ

రాయదుర్గం, జూలై 25(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి కింద 26 మందికి మంజూరైన రూ. 17 లక్షలు విలువ చేసే చెక్కులను ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు శుక్రవారం బాధితులకు అందజేశారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో రూ.1.20 కోట్లు పంపిణీ చేశామన్నారు.

● సుపరిపాలనలో తొలి అడుగు: పట్టణంలోని 30వ వార్డులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో విప్ కాలవ నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు.

● గుమ్మఘట్ట : మండలంలోని బేలోడులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ కాలవ నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ హనుమంతరెడ్డి, కన్వీనర్ గిరిమల్లప్ప, క్లస్టర్ ఇన్‌చార్జి కాలవ సన్నన్న, బేలోడు సంజీవ, పైదొడ్డి రాజు, కేపీదొడ్డి నాగరాజు, బీటీపీ ఛైర్మెన్ కాలవ రాజు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

' మణికంఠా .. బాధ్యతలు మరిచావ్ '

గుంతకల్లు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కూటమి పార్టీల మధ్య సమన్వయం కోసం నియమితుడైన జనసేన నియోజకవర్గ సమన్వయకర్త వాసగిరి మణికంఠ బాధ్యత మరచి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆ పార్టీకి చెందిన కొందరు సీనియర్ నాయకులు ధ్వజమెత్తారు. శుక్రవారం జనసేన నాయకుడు పూల రమణ మీడియాతో మాట్లాడుతూ.. మణికంఠ సీనియర్లను పక్కనపెట్టారని, ఆ విషయాన్ని ప్రశ్నించినందుకు లాయర్ నోటీసు పంపారని అన్నారు. ప్రశ్నించిన శ్రేణులకు లీగల్ నోటీస్ ఇవ్వడం ఏ పార్టీలోనూ చూడలేదన్నారు. ఇక్కడి సమస్యను జిల్లా అధ్యక్షుడికి విన్నవించినా ఆయన పట్టించుకోలేదని, తమ సమస్యను పవన్ దృష్టికే తీసుకెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు బాలాజీ, గోవిందరాజులు, పవన్ నెట్టి, బద్రి, గోపి, చంద్ర, సిద్ధూ, వీరేశ్, విజయ్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

గుత్తి, జూలై25(ఆంధ్రజ్యోతి): స్థానిక అమృత్ థియేటర్ వెనుక ఎస్సీ కాలనీలో మట్కా నిర్వహిస్తున్న ఐదుగురిని అరెస్టుచేసి, వారి వద్ద నుంచి రూ. 34,300, పట్టీలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేశ్ తెలిపారు. అలాగే మండలంలోని అబ్బేదొడ్డి గ్రామ శివారుల్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని.. వారి వద్ద నుంచి రూ. 13,600 స్వాధీనం చేసుకున్నటు తెలిపారు. ఈ దాడుల్లో ఏఎస్ఐ రామాంజనేయులు, హెచ్‌సీ హనుమంతు, సిబ్బంది పాల్గొన్నార

అభివృద్ధికి వైసీపీ సైకో బ్యాచ్ అడ్డు

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు


షాదీమహల్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, జూలై 25(ఆంధ్రజ్యోతి): 'గత వైసీపీ ప్రభుత్వంలో మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడిపనులన్నీ అక్కడే నిలిచిపోయాయి. ఎలాంటి అభివృద్ధీ చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలు అభివృద్ధి పనులు చేపట్టాం. ఓర్వలేక వైసీపీ సైకో బ్యాచ్ లేనిపోని విమర్శలు చేస్తూ.. అభివృద్ధిని అడ్డుకోవడానికి యత్నిస్తోంది. అయినా అభివృద్ధి చేయడమే మా ఏకైక లక్ష్యం..' అని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని 18 వ వార్డు కోటవీధి, 20 వ వార్డు మేడా వీధిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. షాదీమహల్ నిర్మాణ పనులను పరిశీలించారు. అభివృద్ధికి రూ.10 లక్షలు సొంత నిధులు ఇస్తానని హామీ ఇచ్చారు. దాంతో పాటు గాంధీకూడలిని కూడా అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, ప్రజాప్రతినిధులు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీని పరిశీలించిన ఎమ్మెల్యే


పుట్లూరు మండలంలో కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పుట్లూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని హెచ్చెల్సీ, సుబ్బరాయసాగర్ నుంచి బొప్పేపల్లి కాలువ, జాజికొండ వాగును ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శుక్రవారం పరిశీలించారు. రూ.3.58 కోట్లతో కాలువల మరమ్మతులకు ఆమోదం తెలిపారని, నిధులు మంజూరైన వెంటనే పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించి చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తామని అన్నారు. ఎమ్మెల్యే వెంట హెచ్చెల్సీ అధికారులు, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

● యల్లనూరు: నీటిపారుదలశాఖ అధికారులతో కలిసి బొప్పేపల్లి చెరువును ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పరిశీలించారు. ఈ చెరువుకు నీరు అందించి ఇక్కడి రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆమె వెంట నీటిపారుదలశాఖ ఎస్ఈ సుధాకర్‌బాబు, మండల క్లస్టర్ కన్వీనర్ చల్లా చంద్రశేఖర్‌నాయుడు, మండల కన్వీనర్ రామాంజనేయులు, బొప్పేపల్లి రవీంద్రనాథ్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, నిట్టూరు సదాశివారెడ్డి ఉన్నారు.

బదిలీల్లో అన్యాయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పుట్టపర్తి టౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): తనకు అత్యధిక రోస్టర్ పాయింట్లు ఉన్నా, అధికారులు అన్యాయం చేశారని యల్లనూరు కేజీబీవీ పీఈటీ ఈశ్వరమ్మ కలెక్టర్ టీఎస్ చేతన్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. తనకు 36 రోస్టర్ పాయింట్లు మేరకు బత్తలపల్లికి బదిలీ చేశారని, తరువాత ఆ బదిలీని రద్దు చేసి, 18 రోస్టర్ పాయింట్లతో ముదిగుబ్బ కేజీబీవీకి బదిలీ చేశారని వాపోయారు. స్పందించిన కలెక్టర్ విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

క్రైం కార్నర్

రైలు కిందపడి మహిళ మృతి

అనంతపురం న్యూటౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): కల్లూరు, గార్లదిన్నె స్టేషన్ల మధ్య శుక్రవారం రైలు కిందపడి గుర్తుతెలియని మహిళ మృతిచెందింది. రైల్వే ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉదయం 8.30 గంటల సమయంలో ఘటన జరిగిందన్నారు. 30 నుంచి 35 ఏళ్లలోపు వయసున్న మహిళ పంజాబీ డ్రస్‌తో ఉందన్నారు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందిందన్నారు. మృతురాలికి సంబంధించి ఎలాంటి ఆధారాలూ లభించకపోవడంతో గుర్తుతెలియని మహిళగా కేసు నమోదు చేసుకున్నామన్నారు. మృతదేహాన్ని అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించామన్నారు. మృతురాలికి సంబంధించి వారు, ఆచూకీ తెలిసిన వారు 9441445354 నంబరులో సంప్రదించవచ్చని ఎస్ఐ తెలిపారు.

నకిలీ పత్రాలతో బురిడీ

- ప్లాట్ అమ్మి రూ.21 లక్షలు కాజేసిన ఘనుడు
- బుక్కరాయసముద్రంలో కేసు నమోదు



ప్లాటును పరిశీలిస్తున్న సీఐ పుల్లయ్య, బాధితురాలు

బుక్కరాయసముద్రం, జూలై 25(ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలతో ఓ మహిళకు ప్లాట్‌ను విక్రయించి, రూ.21లక్షలకు బురిడీ కొట్టించిన సంఘటన మండలంలోని గోవిందంపల్లిలో వెలుగుచూసింది. పోలీసు లు, బాధితురాలు తెలిపిన మేరకు... తాడిపత్రి మండలం చిన్న పొలమాడ గ్రామానికి చెందిన చక్కారాము గోవిందంపల్లి గ్రామంలో సర్వేనెంబరు 295-5లో వేసిన లేఅవుట్‌లో ప్లాటు నంబరు 114, 115లో 7.16 సెంట్ల భూమి తన పేరుపై ఉన్నట్లు నకిలీ పత్రాలు సృష్టించు కుని, రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. తర్వాత అనంతపురం వినాయక్ నగర్‌కు చెందిన చాకలి నాగరత్నమ్మకు సెంటు రూ.3లక్షల ప్రకారం ఏడు సెంట్లకు రూ.21లక్షలు తీసుకుని 2021 మార్చి 12న విక్రయించాడు. ఇటీవల ఆ స్థలాన్ని శుభ్రం చేయించుకోవడానికి చాకలి నాగరత్నమ్మ అక్కడికి వెళ్లారు. అప్పటికే ప్లాటు ఒరిజనల్ యాజమాని కాంతమ్మ ఫెన్సింగ్ వేసుకుని ఉన్నారు. దీంతో తమ ప్లాట్‌ను ఎవరో ఆక్రమించారని బావించిన చాకలి నాగరత్నమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కాంతమ్మను, ప్లాట్‌ను అమ్మిన చక్కారామును పిలిపించి డాక్యుమెంట్లను సీఐ పుల్లయ్య పరిశీలించారు. చక్కా రాము చూపిన డాక్యుమెంట్ నకిలీది అని తేల్చారు. బాధితురాలు చాకలి నాగరత్నమ్మ ఫిర్యాదు మేరకు చక్కా రాముపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంట్లో ఉన్న బంగారం కుదువపెట్టి, బయట అప్పు చేసి ప్లాట్ కొని, ఇలా మోసపోయానని చాకలి నాగరత్నమ్మ కన్నీరు మున్నీరుగా విలపించారు. పోలీసులు న్యాయం చేయకపోతే తమ కుటుంబం వీధిన పడుతుందని విలపించారు.

భర్త, అత్తపై వేధింపుల కేసు

ధర్మవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): తనను తరచూ వేధిస్తున్నారని భర్త, అత్తపై దండగల భవానీ ఫిర్యాదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఆయన తెలిపిన మేరకు...పట్టణంలోని గిర్రాజుకాలనీకి చెందిన దండగ భవానీ టైలరింగ్ వృత్తితో జీవిస్తోంది. ఈమె భర్త హరీశ్. ఈయన తన తల్లి లక్ష్మీదేవి మాటలు వింటూ తరచూ భవానీ వేధించేవాడు. మద్యానికి బానిసై, వివాహేతర సంబంధాలతో కాలం గడిపేవాడు. తరచూ అవమానిస్తూ, విడాకులు ఇవ్వాలని వేధించేవాడు. దీనికి అతడి తల్లి వత్తాసు పలికేది. ఈ విషయాన్ని భవానీ తన తల్లిదండ్రులకు తెలిపింది. వారు పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు పెట్టినా భర్త, అత్తలో ఏమాత్రం మార్పు రాలేదు. వేధింపులు తట్టుకోలేక భవానీ మూడు నెలల కిందట పుట్టినిల్లు అయిన పుట్టపర్తి మండలం కర్ణాటక నాగేపల్లికి వెళ్లింది. అయినా హరీశ్ ఫోన్‌లో ఆమెను వేధించేవాడు. దీంతో భవాని, ఆమె తల్లి లక్ష్మి శుక్రవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు హరీశ్, లక్ష్మీదేవిలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యార్థినికి వేధింపులు.. పోక్సో కేసు నమోదు

గుత్తి, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యార్థినిని వేధించడమే కాక, బెదిరించి ఫొటోలు దిగిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలానికి చెందిన విద్యార్థినిపై తురకపల్లికి చెందిన మధుసూదన్ ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడ్డాడు. ఆమె తల్లితండ్రులను చంపుతానని బెదిరించి, విద్యార్థినితో ఫొటోలు దిగాడు. అతడి వేధింపులతో విద్యార్థిని తల్లితండ్రులు ఊరు వదిలి గుత్తి ఆర్ఎస్‌కు చేరుకుని, ఇక్కడే నివశిస్తున్నారు. అయినా మధుసూదన్ వదల్లేదు. తనను వివాహం చేసుకోవాలని హెచ్చరించాడు. 'లేదంటే నిన్నూ, నీ కుటుంబాన్నీ అంతం చేస్తా' అని బెదిరించాడు. దీంతో విషయాన్ని విద్యార్థిని.. తల్లిదండ్రులకు చెప్పింది. వారు శుక్రవారం గుత్తి పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఆ మేరకు మధుసూదన్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

కోరిక తీర్చకుంటే చంపుతా..!

● మహిళకు లైంగిక వేధింపులు ● కేసు నమోదు

యాడికి, జూలై25(ఆంధ్రజ్యోతి): తన కోరిక తీర్చకపోతే చంపుతా అంటూ మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలానికి చెందిన మహిళ శుక్రవారం ఉదయం పొలం వద్ద పనులు చేసుకుంటుండగా లక్షుంపల్లికి చెందిన వెంకటేశ్వరరెడ్డి ఆమె వద్దకెళ్లాడు. చేయి పట్టుకుని, బలాత్కారం చేయబోయాడు. తన కోరిక తీర్చాలనీ, లేకపోతే చంపుతానని బెదిరించాడు. అతడి బారి నుంచి తప్పించుకున్న మహిళ.. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు వెంకటేశ్వరరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అప్రమత్తంగా ఉండండి

బెళుగుప్ప, జూలై 25(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి రిజర్వాయర్‌కు కృష్ణా జలాలు విడుదల చేయడంతో హంద్రీనీవా కాలువ పరిసర ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ అనిల్ కుమార్ శుక్రవారం సూచించారు. కాలువ ఆధునికీకరణతో నీటి ప్రవాహం అధికంగా ఉంటుందని, చిన్న పిల్లలు, మృత్యుకారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

పాడి రైతుల జీవన ప్రమాణాలపై సర్వే

అనంతపురం అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాడి రైతులు, గొర్రెలు, మేకల కాపరుల జీవన ప్రమాణాలు, స్థితిగతులపై సమగ్ర సర్వే నిర్వహిస్తున్నట్లు పశుసంవర్థక శాఖ ఇన్‌చార్జి జేడీ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. జిల్లాలోని 87వేల కుటుంబాలను సమగ్ర సర్వే చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు. జిల్లాలో శుక్రవారం ఈ సర్వే మొద లైందని, సెప్టెంబరు 15 దాకా కొనసాగుతుందన్నారు. స్థానిక వెటర్నరీ సిబ్బందితో ఈ సర్వే చేయిస్తున్నామన్నారు. ఆయా కుటుంబాల్లో పాడి, గొర్రెల పెంపకం ద్వారా ఎంత ఆదాయం వస్తోంది..? బ్యాంక్ నుంచి రుణం పొందారా..? ప్రభుత్వ పరంగా ఏఏ పథకాలు వర్తింప జేస్తున్నా రు..? ఇంకా ఏమైనా సాయం అవసరమా..? తదితర అంశాలపై సమగ్ర సర్వే చేసి, ప్రత్యేక ప్రొఫార్మాలో పొందుపరుస్తామన్నారు. సర్వేకు పాడి రైతులు, గొర్రెల పెంపకందారులు సహకరించాలని సూచించారు.

28న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి జూనియర్ బాల, బాలికల విభాగాల్లో అథ్లెటిక్ ఎంపిక పోటీలు ఈనెల 28వ తేదీన స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ కమిటీ చైర్మన్ ఇస్మాయిల్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయిలో అండర్ 14, 16, 18, 20 బాల, బాలికల విభాగాల్లో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హతగల వారు యూనిఫాంతో హాజరుకావాలన్నారు. ఎంపికైన వారు ఆగస్టు 9వ తేదీ నుంచి బాపట్లలో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు 9052288643, 9494434767 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వామ్మో.. చిరుత..!

అనంతపురం సమీపాన సంచారం

- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- ప్రజలకు పోలీసుల జాగ్రత్తలు
- రాయదుర్గం వద్ద కొండపై మరొకటి ప్రత్యక్షం

అనంతపురం క్రైం/రూరల్/రాయదుర్గం రూరల్/గుమ్మఘట్ట, జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేర్వేరుచోట్ల చిరుతల సంచారం అలజడి రేపింది. అనంతపురం రూరల్ మండలంలో చీకట్లో చిరుత పరుగులు తీస్తున్న వీడియో శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. రూరల్ ఏరియాలోని బీఎస్ఆర్ కాలనీ, సదా శివ కాలనీ ప్రాంతాల వెనుక వైపున చిరుత సంచరిస్తోందంటూ స్థానిక ప్రజలు భయాందోళనకు లోనయ్యారు. దీంతో రూరల్ సీఐ శేఖర్, ఎస్ఐ రాంప్రసాద్, పోలీసు సిబ్బంది.. రాత్రి ఆయా ప్రాంతాలకు వెళ్లి గాలించారు. ప్రజలను అప్రమత్తం చేశారు. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. నాలుగు రోజుల క్రితం కూడా నరసనాయునికుంట ప్రాంతంలో కుక్కలపై చిరుత దాడి చేసిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే బీఎస్ఆర్ కాలనీ ప్రాంతానికి సైతం కుక్కల కోసం చిరుత వచ్చి ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పంపనూరు అటవీ ప్రాంతం నుంచీగానీ, ఇతర ప్రాంతాల నుంచీగానీ చిరుత వచ్చి ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ, భయపడాల్సిన అవసరం లేదని పోలీసులు సూచించారు.



అనంతపురం రూరల్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కొండపై చిరుత సంచారం

రాయదుర్గం పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డు చెక్‌పోస్టు వద్ద ఉన్న కొండపై చిరుత శుక్రవారం సాయంత్రం కలకలం రేపింది. దీంతో కాలనీవాసులు భయాందోళనకు లోనయ్యారు. కొండపై పెద్ద బండరాయి వద్ద అటు.. ఇటు.. తిరుగుతూ కనిపించింది. అటవీ అధికారులు.. చిరుతను బంధించి తరలించాలని కోరారు.

గ్రామంలోకి ఆలువ

గుమ్మఘట్ట మండలంలోని తాళ్లకెర గ్రామంలోని మాల వీధిలోకి గురువారం రాత్రి వన్యప్రాణి ఆలువ వచ్చింది. మాల రామాంజనేయులు ఇంట్లోకి రాగా.. కుటుంబసభ్యులు పట్టుకున్నారు. గంప కింద ఉంచారు. శుక్రవారం రెవెన్యూ అధికారుల సాయంతో అటవీశాఖ అధికారి దామోదర్‌రెడ్డికి అప్పగించారు. పుట్టపర్తి అటవీ ప్రాంతంలో వదలి పెట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రామాంజనేయులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

స్వామీ.. నారాయణా..!

- వెలుగులోకి సబ్ రిజిస్ట్రార్ నారాయణస్వామి అక్రమాలు
- లంచమే ధ్యేయంగా రిజిస్ట్రేషన్లు
- వేరే పట్టణాలవి సైతం 'దుర్గం'లోనే రిజిస్ట్రేషన్
- కొనసాగుతున్న ఏసీబీ సోదాలు

కళ్యాణదుర్గం/రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఏసీబీ అధికారులకు పట్టుబడిన సబ్‌రిజిస్ట్రార్ నారాయణస్వామి అవినీతి కార్యకలాపాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. తకరారు ఉన్న భూములనే టార్గెట్ చేసి, ఇక్కడే రిజిస్ట్రేషన్ చేయించి లక్షల్లో డబ్బులు గుంజినట్లు వినిపిస్తోంది. ఏసీబీ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి, ఏసీబీ సీఐ అమీద్‌ఖాన్, సిబ్బంది ఉమేశ్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నుంచి కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోదాలు కొనసాగుతున్నాయి. గత ఏడాది డిసెంబరులో కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్‌గా నారాయణ స్వామి బాధ్యతలు తీసుకున్నాడు. అప్పటి నుంచి జూలై 24 వరకు చేసిన రిజిస్ట్రేషన్‌కు సంబంధించి రికార్డులన్నీ వారు క్షుణంగా పరిశీలిస్తున్నారు. అయితే ఏసీబీ అధికారులు వివరాలు వెల్లడించడం లేదు.

తకరారు భూములకు ఇక్కడే రిజిస్ట్రేషన్

అనంతపురం, రాప్తాడు, కాళహస్తి, తిరుపతి, విజయవాడ, రాయ దుర్గం, బుక్కపట్నం, ధర్మవరం తదితర ప్రాంతాలకు చెందిన తకరారు భూములన్నింటికీ ఇక్కడే రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో సమస్యలున్న భూములు, కోర్టు వివాదంలో ఉన్న భూములను ఎక్కువభాగం ఇక్కడే రిజిస్ట్రేషన్ చేయించారన్న వాదనలు ఉన్నాయి. తకరారు ఉన్న భూములన్నీ రెండు, మూడు రోజుల్లోనే రిజిస్ట్రేషన్ చేయించి, మధ్యవర్తుల ద్వారా లక్షల్లో డబ్బులు గుంజారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటివి కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వేదికగా వందల్లో జరిగినట్లు సమాచారం. ఇలాంటివన్నీ సోదాల్లో బయట పడుతుండటంతో ఏసీబీ అధికారులే విస్తుపోతున్నారు. ఇతర ప్రాంతాల భూములను ఎందుకు ఇక్కడే రిజిస్ట్రేషన్ చేశారన్న కోణంలో వివరాలు సేకరించే పనిలో ఏసీబీ అధికారులు నిమగ్నం అయినట్లు తెలిసింది.

బాధితుడి భూమి కూడా అనంతపురంలో రిజిస్ట్రేషన్ చేయించారు..



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొనసాగుతున్న ఏసీబీ అధికారుల సోదాలు

ఏసీబీకి పట్టించిన నాగేంద్రనాయక్‌ను సబ్‌రిజిస్ట్రార్ నారాయణస్వామి కళ్యాణదుర్గం కార్యాలయం చుట్టూ 20 రోజులు తిప్పుకున్నాడు. దీంతో విసుగు చెందిన ఆయన ఏసీబీని ఆశ్రయించి పట్టించినట్లు తెలిసింది. కళ్యాణదుర్గం మండలం నుసికొట్టాల తండాకు చెందిన నాగేంద్ర నాయక్ అనంతపురంలో నివాసం ఉంటున్నాడు. 252 సర్వేనెంబర్‌లో కళ్యాణదుర్గం మండలం ఒంటిమిద్దె ప్రాంతం వద్ద 1.5 ఎకరా భూమి ఉంది. ఈ భూమి అంతా అగ్రికల్చర్ ల్యాండ్ కింద వెబ్‌ల్యాండ్‌లో నమోదైంది. రిజిస్ట్రేషన్ చేయాలని సబ్‌రిజిస్ట్రార్ నారాయణస్వామిని సంప్రదించాడు. అయితే ఈ భూమి నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ కింద ఉందని, గజాల్లోకి విలువ కట్టి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచిం చారు. ఈ నేపథ్యంలో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కొన్ని రోజుల తర్వాత వారిద్దరి మధ్య రాజీ ఒప్పందం కుదిరింది. ఈక్రమంలోనే అనంతపురం రామ్‌నగర్‌లో ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ నెల 17న రిజిస్ట్రేషన్ చేయించాడు. రూ. ఏడు లక్షలకు బేరం కుదుర్చుకుని, రూ. 5లక్షలు ఇచ్చాడు. బాధితుడి ఫిర్యాదుతో ఏసీబీ అధికారులు వలపన్నీ పట్టుకున్నారు. ఇలా వివాదం ఉన్న భూములన్నీ కళ్యాణదుర్గం కేంద్రంగా రిజిస్ట్రేషన్ చేస్తే సమస్యలు ఉత్పన్నం అవుతాయని భావించి, తెలివిగా వేరే ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ చేయిస్తూ అక్రమాలకు పాల్పడ్డాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా ఏసీబీ అధికారుల దాడులతో డాక్యుమెంట్ రైటర్ల కార్యాలయాలన్నీ బంద్ చేశారు.

ఆ అధికారి అవినీతిపై సమాచారం ఇవ్వండి

కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ నారాయణస్వామి అవినీతిపై సమాచారాన్ని ఇవ్వాలని ఏసీబీ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి కోరారు. 9440446190 అనే నెంబర్‌కు సమాచారం అందించాలని, వివరాలు అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.



ఊరేగింపుగా బోనాలు తీసుకెళ్తున్న గ్రామస్థులు

వర్షం కోసం పూజలు

వజ్రకరూరు (ఉరవకొండ), జూలై 25(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని గూళ్యపాళ్యెంలో వర్షం కోసం పూజలు నిర్వహించారు. గ్రామసమీపంలోని కొండ మీద వెలసిన భగవతమ్మ అమ్మవారికి బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

ఉరవకొండ, జూలై 25(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ చేసిన ప్రతిపాదన మేరకు రాష్ట్ర నూర్‌బాషా దూదేకుల కార్పొరేషన్‌ను నెలకొల్పడానికి మంత్రి మండలి ఆమోదం తెలపడంపై నూర్‌బాషా మహమ్మద్, దూదేకుల సంక్షేమ సంఘం నాయకులు తయూబ్, శర్మాషవలి శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

29న వాహనాల బహిరంగ వేలం

బెళుగుప్ప, జూలై 25(ఆంధ్రజ్యోతి): పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న నాలుగు చక్రాల వాహనాలు నాలుగు, ద్విచక్ర వాహనాలు నాలుగింటిని స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం బహిరంగ వేలం వేస్తున్నట్లు ఎస్ఐ శివ శుక్రవారం తెలిపారు. రూ. వెయ్యి రుసుము చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

తాడిపత్రి, జూలై 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టైలర్స్ కాలనీలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్‌లోని 20 మంది టీబీ రోగులకు కౌన్సిలర్ హుస్సేన్‌బాషా నిత్యావసర సరుకులను శుక్రవారం పంపిణీచేశారు. కార్యక్రమంలో డీపీఎంఓ శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ యశస్విని, టీబీ సూపర్‌వైజర్ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

అక్రమ పైపులైన్ల తొలగింపు

కణేకల్లు, జూలై 25(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీపై అనధికారికంగా వేసిన పైపులైన్లను హెచ్చెల్సీ అధికారులు శుక్రవారం తొలగించారు. అంబాపురం నుంచి హెచ్చెల్సీ సబ్ డివిజన్‌లో పలు తూముల వద్ద నాన్ ఆయకట్టు రైతులు వేసుకు న్న పైపులైన్లను వర్కర్ల సాయంతో హెచ్చెల్సీ జేఈ నరేంద్రమారుతి తొలగించారు. ఎవరైనాఅక్రమ పైపులైన్లు వేయడానికి ప్రయత్నిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

ముళ్లచెట్ల తొలగింపు

కణేకల్లు, జూలై 25(ఆంధ్రజ్యోతి): స్థానిక చంద్రబాబు కొట్టాల వద్ద ఉన్న సబ్‌మార్కెట్‌కు పోవు దారిలో ఉన్న ముళ్లచెట్లను శుక్రవారం తొలగించారు. రాయదుర్గం మార్కెట్ యార్డు డైరెక్టర్ చాంద్‌బాషా ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్ సాయంతో దాదాపు కిలోమీటరు వరకు ఉన్న దారిలోని ముళ్లచెట్లను తొలగించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, మాబుసాబ్, షేక్‌ముజ్జు, కురుబ నాగరాజు, చాకలి ప్రసాద్ పాల్గొన్నారు.

29న సర్వసభ్య సమావేశం

శెట్టూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జిలానీబాషా శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలన్నారు.

రక్షణ కల్పించండి

● ఎస్పీకి ప్రేమజంట వినతి

అనంతపురం క్రైం, జూలై25(ఆంధ్రజ్యోతి): తాము ప్రేమించి పెళ్లి చేసుకున్నామనీ, రక్షణ కల్పించాలని ప్రేమజంట.. ఎస్పీకి విన్నవించుకుంది. విడపనకల్లు మండలం పాల్తూరుకు చెందిన ఎర్రిస్వామి(24), మల్లాపురానికి చెందిన గౌతమి(22) శుక్రవారం ఎస్పీ జగదీష్‌ను కలవడానికి జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు... శివప్ప, సుంకులమ్మ దంపతుల కుమారుడు ఎర్రిస్వామి ఇంటర్ వరకూ చదువుకుని వ్యవసాయం చేస్తున్నాడు. మల్లాపురం గ్రామానికి చెందిన గోవిందు, వన్నూరమ్మ దంపతుల కుమార్తె గౌతమి డిగ్రీ వరకూ చదువుకుంది. ఇద్దరూ ఏడాదిన్నరగా ప్రేమించుకున్నారు. గౌతమికి కుటుంబీకులు ఇటీవల పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రేమికులు ఈనెల 24న ఇళ్ల నుంచి వెళ్లిపోయారు. కర్ణాటకలోని ఓ దేవాలయంలో శుక్రవారం పెళ్లి చేసుకున్నారు. విషయం తెలుసుకున్న వధువు తల్లిదండ్రులు, బంధువులు.. పాల్తూరికి వెళ్లారు. ఎర్రిస్వామి తండ్రి శివప్పను ఊరిలోని గుడి వద్దకు తీసుకెళ్లి గురువారం రాత్రి చెట్టుకు కట్టేసి కొట్టారు. ఊరి పెద్దలు వారించడంతో విడిచిపెట్టారు. విషయం తెలుసుకున్న ప్రేమ జంట శుక్రవారం ఉదయం నేరుగా అనంతపురం ఎస్పీ కార్యాలయానికి వచ్చింది. ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ... తాము ఇష్టపూర్వకంగానే పెళ్లి చేసుకున్నామన్నారు. గౌతమి కుటుంబీకుల నుంచి ప్రాణహాని ఉందనీ, రక్షణ కోరేందుకు వచ్చామని వివరించారు. తర్వాత ఎస్పీ జగదీష్‌ను కలిసి సమస్యను తెలియజేసి, వినతిపత్రం అందించారు.



మీడియాతో మాట్లాడుతున్న ప్రేమజంట



రాగులపాడు వద్ద హంద్రీనీవా నీటి పంపింగ్

ఆరు మోటార్లతో ఎత్తిపోత

● జీడిపల్లికి వడివడిగా కృష్ణాజలాలు

ఉరవకొండ/బెళుగుప్ప, జూలై 25(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని రాగులపాడు 8వ పంప్‌హౌస్ నుంచి ఆరు మోటార్లతో కృష్ణా జలాలను హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా జీడిపల్లికి ఎత్తి పోస్తున్నారు. రాగులపాడు పంప్‌హౌస్‌కు ఈ నెల 22న నీరు చేరింది. దీంతో అధికారులు మూడు మోటార్లను ఆన్‌చేసి నీటిని ఎత్తిపోసిన విషయం తెలిసిందే. రెండు రోజుల నుంచి రాగులపాడు వద్ద ఆరు మోటార్లతో ఎత్తిపోతను ప్రారంభించారు. దీంతో జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 1012 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో నీటి నిల్వ 1.07 టీఎంసీలు ఉన్నట్లు వెల్లడించారు. ఈ నెలాఖరులోపు జీడిపల్లి రిజర్వాయర్‌ను నింపి, అక్కడి నుంచి పీఏబీఆర్, ఎంపీఆర్ డ్యాంకు నీటిని విడుదల చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన

బుక్కరాయసముద్రం, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు రానున్న ఐదు రోజుల్లో తేలికపాటి లేదా ఓ మోస్తరు వర్ష సూచన ఉన్నట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి తెలిపారు. పలు చోట్ల తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 31-33.8 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23.9-24.5 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చన్నారు. నైరుతి దిశగా గాలులు గంటకు 6కి.మీవేగంతో వీచే అవకాశముందన్నారు. గాలిలో తేమ ఉదయం పూట 63-80, మధ్యాహ్నం పూట 48-72 నమోదు అయ్యే అవకాశం ఉందన్నారు. అనంతపురం జిల్లాలో 26న 1.2 మి.మీ, 27న 0.4 మి.మీ 28న 0.6 మి.మీ, 29న 0.2 మి.మీ 30న 0.4మి.మీ కురిసే అవకాశం ఉందన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 26న 0.7 మి.మీ, 27న 0.4 మి.మీ 28న 0.6 మి.మీ, 29న 0.2 మి.మీ 30న 0.4మి.మీ కురిసే అవకాశం ఉందన్నారు.

రైలు పాక్షిక రద్దు

గుంతకల్లు, జూలై 25(ఆంధ్రజ్యోతి): అనంతపురం, గుత్తి మీదుగా వెళ్లే యశ్వంతపూర్-లక్నో వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను రెండు నెలలపాటు పాక్షికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉత్తర రైల్వేలోని లక్నో రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాం వర్కుల కారణంగా ఈ రైలును లక్నో వరకూ కాకుండా అంత్రేటియా స్టేషన్ వరకే నడపనున్నట్లు తెలిపారు. యశ్వంతపూర్-లక్నో ఎక్స్‌ప్రెస్ (నం. 22683)ను ఆగస్టు 4, 11, 18, 25, సెప్టెంబరు 1, 8, 15, 22 తేదీల్లో అంత్రేటియా వరకూ మాత్రమే నడపనున్నామన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 22684) ఆగస్టు 7, 14, 21, 28, సెప్టెంబరు 4, 11, 18, 25 తేదీల్లో లక్నో నుంచి కాకుండా అంత్రేటియా నుంచి ప్రారంభం అవుతుందన్నారు.

నెట్టికంటి సన్నిధిలో మంత్రి సుభాష్



స్వామి సన్నిధిలో మంత్రి వాసంశెట్టి, ఆలయ అధికారులు, నాయకులు

గుంతకల్లు, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం ఉదయం మండలంలోని కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో పూజలు చేశారు. కర్నూలు జిల్లా పత్తికొండలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి హాజరవడానికి మంత్రి ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో గుంతకల్లుకు వచ్చారు. స్థానిక రైల్వే గెస్టు హౌస్‌కు చేరుకున్న మంత్రిని టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి తదితరులు సన్మానించారు. అనంతరం కసాపురం దేవస్థానానికి వెళ్లిన మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి, స్వామివారి సన్నిధిలో పూజలు చేయించారు. స్వామివారి కండువాలను వేసి ఆశీర్వచనం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, గుడిపాటి ఆంజనేయులు, రామన్న చౌదరి, యుగంధర్, మత్రునాయక్, ఆలయ ఈఓ వాణి, ధర్మకర్త సుగుణమ్మ, అర్చకులు రాఘవాచార్యులు, ప్రశాంత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రతాప్‌రెడ్డి



రాయదుర్గం, జూలై 25(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా గౌని ప్రతాప్‌రెడ్డిని అధిష్టానం నియమించింది. రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలను నుంచి శుక్రవారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు.